ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శనివారం 21 సెప్టెంబరు 2024 | 5



మీ సమస్యలేంటమ్మా : మహిళల సమస్యలు వింటున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల



ప్రసాదంలోనూ.. నె..కుడేనా!?

కిలో నెయ్యి అన్నవరంలో రూ.538.. సింహాచలంలో కిలో రూ.344

తిరుపతి దేవస్థానానికి సరఫరా అవుతున్న నెయ్యిలో చేప నూనె, జంతు కొవ్వు అవశేషాలు బయటపడి సంచలనం సృష్టిస్తోంది.. తిరుపతి ప్రసాదాన్ని భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారు.. అటువంటిది అక్కడే కల్తీ జరిగిందంటే మిగిలిన ఆలయాల మాటేంటి ఇదీ ప్రతీ భక్తుడిని తొలుస్తున్న ప్రశ్న. మన జిల్లాలో అన్నవరం ప్రసాదానికి మహా డిమాండ్.. ప్రతి ఏటా లక్షలాది కిలోల నెయ్యి వినియోగిస్తారు. అటువంటిది అన్నవరం ఆలయానికి సరఫరా అవుతోన్న నెయ్యిపై 'ఆంధ్రజ్యోతి' ఆరా తీసింది. దీంతో ఈ నెయ్యి బండారం బయటపడింది. ఒకే కంపెనీ అన్నవరం దేవస్థానానికి.. సింహాచలం దేవస్థానానికి నెయ్యి సరఫరా చేస్తోంది.. అన్నవరంలో కిలో నెయ్యికి రూ.538 వసూలు చేస్తుంటే.. అదే కంపెనీ సింహాచలంలో మాత్రం కిలో రూ.344 వసూలుచేయడం గమనార్హం. నేతలు, అధికారుల అండదండలతో కాంట్రాక్టరు గీకుడుకి అడ్డు లేకుండాపోయింది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అన్నవరం దేవస్థానానికి సరఫరా అవుతోన్న లక్షల కిలోల నెయ్యి మంచిదేనా..? లక్షలాది మంది భక్తులు ఇష్టంగా తినే ప్రసాదంలో పూర్తిగా నెయ్యి నాణ్యత పాటిస్తున్నారా..? ఆలయానికి సరఫరా అవుతోన్న నెయ్యి గడచిన రెండేళ్లుగా ఒకే కంపెనీ నుంచే ఎందుకు వస్తోంది.. ఆరునెలలకోసారి టెండర్లు పిలుస్తుండగా.. ప్రతిసారీ అదే కంపెనీకి కాంట్రాక్టు ఎలా దక్కుతోంది.. అదే కంపెనీ సింహాచలం దేవస్థానానికి కిలో నెయ్యి రూ.344కి సరఫరా చేస్తుంటే అన్నవరంలో మాత్రం కిలో రూ.538 ఎలా వసూలు చేస్తోంది. ఏటా దేవస్థానానికి 1.80 లక్షల కిలోల నెయ్యి అవసరమైతే అంత భారీ నెయ్యి ఒక డీలర్ ఎలా సరఫరా చేయగలుగుతున్నాడు. మార్కెట్లో లభ్యమయ్యే నాణ్యమైన నెయ్యి ధరకు.. దేవస్థానానికి సరఫరా చేసే ధరకు ఇంత వ్యత్యాసం ఉంటే.. మరి ఆలయానికి వచ్చే నెయ్యిలో అంత నాణ్యత ఉంటుందా? ఇలా ఎన్నో సందేహాలు భక్తుల నుంచి ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి.

నాణ్యతపై అనుమానాలెన్నో...

వాస్తవానికి స్వచ్ఛమైన నాణ్యతతో కూడిన కిలో ఆవు నెయ్యి రూ.వెయ్యి వరకు పలుకుతోంది. ఆలయాలకు మాత్రం కాంట్రాక్టర్లు సగం ధరకే సరఫరా చేస్తుండడంతో నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లక్షల కిలోల్లో సరఫరా కాబట్టి కాస్త బల్క్‌గా ధర తగ్గిందనుకున్నా ఏదో పేరొందిన డెయిరీలు మాత్రమే ఆ స్థాయిలో నెయ్యి సరఫరా చేయగలవు. అయితే వైసీపీ వచ్చిన తర్వాత వరుసగా రెండేళ్లపాటు ఒకే కంపెనీ నెయ్యి సరఫరా చేస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కంపెనీ తరపున ఓ

- ఒకే కంపెనీ. ధరలో మాత్రం భారీ వ్యత్యాసం
- అన్నవరం దేవస్థానంలో నెయ్యి మాయాజాలం
- రెండేళ్లుగా ఒకే కంపెనీ నుంచి నెయ్యి కొనుగోలు
- నాలుగు సార్లు టెండర్లు.. ఒకే కంపెనీకి కాంట్రాక్టు
- గతంలో విజయ డెయిరీ నుంచి కొనుగోలు
- వైసీపీలో అనామక కంపెనీ నుంచే సరఫరా
- ఏటా 1.80 లక్షల కిలోల నెయ్యి అవసరం
- రెండేళ్లలో రూ.7.76 కోట్ల నొక్కుడు

డీలరు ఇంత భారీ నెయ్యిని ఎలా సరఫరా చేస్తున్నాడనే దానిపై అనుమానాలున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే రోజుకు దాదాపు 496 కిలోల నెయ్యి ఆలయానికి సరఫరా చేయడం అసాధ్యం. పైగా ఒక కిలో ఆవు నెయ్యి తయారవ్వాలంటే సరాసరి 30 లీటర్లకుపైగా పాలు అవసరం. మరి ఈ స్థాయిలో నెయ్యి తయారు చేసి సరఫరా చేయడం సాధారణ కాంట్రాక్టర్‌కు సాధ్యం కాదు. వేర్వేరు ప్రాంతాల నుంచి సేకరించి మిక్స్ చేసే అవకాశాలున్నాయి. దేవస్థానం ఈ నెయ్యి నాణ్యతను ఎంత వరకు సమర్థవంతంగా పరీక్షిస్తుందనేదానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పటికప్పుడు నెయ్యి నాణ్యతను పరీక్షించాల్సి ఉండగా, వైసీపీ పెద్దల సిఫారసు చేసిన కాంట్రాక్టరు కావడంతో అధికారులు ఇదేదీ పెద్దగా పట్టించుకోవడం లేదు. తాజాగా తిరుపతి దేవస్థానానికి సరఫరా అయిన నెయ్యి వివాదాస్పదమైన నేపథ్యంలో ఇక్కడకు సరఫరా అవుతోన్న నెయ్యిపై ఇక నుంచి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



2 కోట్ల ప్యాకెట్లు అమ్మకం..

అన్నవరం దేవస్థానం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రం. ఏటా లక్షలాది మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. ఇక్కడకు వచ్చే ప్రతి భక్తుడు ఎంతో ఇష్టంగా అన్నవరం ప్రసాదాన్ని తింటారు. ఏటా రెండు కోట్ల వరకు ప్రసాదం ప్యాకెట్లు అమ్ముడవుతాయి. ఈ ప్రసాదం తయారీలో నెయ్యి కీలకమైనది. దీని నాణ్యతపైనే ప్రసాదం రుచి ఆధారపడి ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒకే కంపెనీ గడచిన రెండేళ్లుగా నెయ్యి సరఫరా చేస్తోంది. ఈ నెయ్యి ధరపై అనేక అనుమానాలు ఉన్నాయి.

రెండేళ్లు..4 టెండర్లు.. ఒకరికే..

అన్నవరం ఆలయానికి ఏటా 1.80 లక్షల నుంచి రెండు లక్షల కిలోల వరకు నెయ్యి అవసరం. ఈ నెయ్యి కొనుగోలు కోసం దేవస్థానం సెంట్రల్ స్టోర్స్ విభాగం ప్రతి ఆరు నెలలకోసారి టెండర్లు పిలుస్తుంది. ఎవరు తక్కువ ధర కోట్ చేస్తే వారికే అప్పగిస్తుంది. 2022 అక్టోబరు నుంచి ఇప్పటి వరకు నాలుగు సార్లు టెండర్లు పిలవగా వరుసగా ఒకే కంపెనీ పేరుతో టెండర్‌లో పాల్గొంటున్న ఓ డీలర్‌కే ఈ కాంట్రాక్టు దక్కుతుండడం అనుమానాలకు తావిస్తోంది. సదరు కాంట్రాక్టర్ కోట్ చేసిన ధర ఇతర ఆలయాలకంటే ఎక్కువగా ఉన్నా అధికారులు ఇదేదీ పట్టించుకోలేదు. ఈమేరకు అధికారంలో ఉన్న సమయంలో కొందరు వైసీపీ పెద్దలు పావులు కదపడం విశేషం. గడచిన రెండేళ్లుగా సదరు డీలరు దేవస్థానానికి కిలో నెయ్యి 2022 అక్టోబరు నుంచి 2023 మార్చి వరకు కిలో రూ.498 చొప్పున, 2023 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు కిలో రూ.564 చొప్పున, 2023 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు రూ.540, 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు రూ.538.60 చొప్పున సరఫరా చేస్తున్నాడు. సింహాచలం దేవ స్థానానికి మాత్రం ఇదే కంపెనీ కిలో నెయ్యి రూ.344 చొప్పున సరఫరా చేస్తోంది. దీన్నిబట్టి అన్నవరం ఆలయానికి సరఫరా చేసే నెయ్యి ధరలో ఎంత పిండేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ ధరతో పోల్చితే ఈ రెండేళ్లలో దేవస్థానానికి రూ.7.76 కోట్లు నష్టం వాటిల్లినట్టు లెక్క. తిరుపతిలాంటి దేవస్థానానికి కిలో నెయ్యి రూ.411కి సరఫరా కాగా ఇక్కడ మాత్రం ధరలో వ్యత్యాసం ఉండడం విశేషం. వాస్తవానికి జగన్ సర్కారు రాక ముందు అన్నవరం దేవ స్థానానికి సంగం, విజయలాంటి పేరొందిన డెయిరీల నుంచి నెయ్యి వచ్చేది. కమీషన్ల కక్కుర్తితో వైసీపీ 2022 నుంచీ ఊరు పేరు లేని కంపెనీని తెరపైకి తెచ్చి నెయ్యి సరఫరా చేయిస్తుండడం విశేషం.

ప్రజల చెంతకు.. పాలకులు

సీఎం ఆదేశంతో ఇంటింటికీ ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) /రాజమహేంద్రవరం రూరల్ :కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా సీఎం నారా చంద్రబాబునాయుడు పిలుపుమేరకు శుక్రవారం నుంచి "ఇది మంచి ప్రభుత్వం" అనే కార్యక్రమం ప్రారంభించారు. జిల్లాలోని ఎమ్మెల్యేలంతా ఆయా నియోజకవర్గాల్లో పర్యటించారు. తొలి రోజు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.ఈ నెల 26వ తేదీ వరకూ ప్రజా ప్రతినిధులు, పార్టీవర్గాలు, అధికారులు ప్రజల మధ్యలో ఉంటారు. వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన మంచి పనులు, నెరవేర్చిన హామీలను ప్రజలకు వివరిస్తారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుంటారు. వాటిని నమోదు చేసుకుని పరిష్కరిస్తారు.ప్రతి ఊరులోనూ ప్రజా వేదికలు నిర్వహిస్తున్నారు.ఇందులో ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కాతేరు పంచాయతీ పరిధిలో గల శాంతినగర్‌లో ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. తాము గత 10 పదేళ్లగా శాంతి నగర్‌లో ఉంటున్నా మౌలిక వసతుల్లేవని వాపోయారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గోరంట్ల గ్రామంలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీరందిస్తామని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు లాలా చెరువు, చౌడేశ్వరినగర్, వాంబే కాలనీలో పర్యటించారు.అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బిక్కవోలు మండలం పందలపాక, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కొవ్వూరు ఇందిరమ్మ కాలనీ, యానాది కాలనీ, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు నల్లజర్లలో పర్యటించారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సీతానగరం మండలం ఇనుగంటి వారిపేట, రామచంద్రాపురం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రధాన సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు.

ఇంటింటికీ స్టిక్కర్లు..

100 రోజుల పాలన సందర్భంగా "ఇది మంచి ప్రభుత్వం" పేరుతో విజయ సంకేతాన్ని చూపించే రెండు వేళ్ల గుర్తుతో ఉన్న స్టిక్కరును ప్రతీ ఇంటికి ఇస్తున్నారు.దాంతో పాటు ప్రభుత్వ విజయాల కరపత్రం పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్ సీపీవో, డీఎల్‌డీవోలకు బాధ్యతలు అప్పగించారు. మండల, పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించారు.స్టిక్కర్, కరపత్రాలు ఇంటింటికీ పంపిణీ చేసే బాధ్యతను సచివాలయ సెక్రటరీలకు అప్పగించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనవచ్చు.

సీఎస్ఆర్ నిధులతో హాస్టళ్లలో పనులు : కలెక్టర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాల కల్పనపై దృష్టి సారించామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. సంక్షేమ, పరిశ్రమల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ప్రస్తుత పరిస్థితి, చేపట్టవలసిన పనులు, సిద్ధం చేయాల్సిన అంచనాలపై సమీక్షించారు. వసతి గృహాల్లో అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న వసతి గృహాలను వేరొక చోటికి మార్పు చేయాలన్నారు. ఆయా పనులను పరిశ్రమల ఆధ్వర్యంలో చేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో జిల్లా ప్రణాళిక అధికారి,పరిశ్రమలు, ఫ్యాక్టరీల అధికారులు పరిశీలించి త్వరితగతిన నివేదిక అందజేయాలని ఆదేశించారు. రాజమహేంద్రవరం, నిడదవోలు, కానూరు, కోరు కొండ, రాజానగరం, గోకవరం,కడియం, రంగంపేట, దుద్దుకూరు, నల్లజర్ల, కా నూరు, తాళ్లపూడిలో అవసరమైన పనులపై అధికారులు కలెక్టర్‌కి వివరించారు.

ఇసుక తీతకు రెడీ!

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుక సరఫరాకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం ఇసుక కొరత అధికంగా ఉన్న నేపథ్యంలో వెంటనే ఇసుక తీత మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు అఖండగోదావరి పరిధిలోని ధవళేశ్వరం బ్యారేజి నుంచి గోదావరి నాల్గో బ్రిడ్జి (గామన్) వరకూ 9 డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించారు. ఈ పాయింట్లలో ఇసుక తీయడానికి మొత్తం 48 బోట్స్‌మన్ సొసైటీలను గుర్తించారు. అందులో 40 సొసైటీలకు ఇప్పటికే అనుమతి రాగా శనివారం మరో 8 సొసైటీల ఖరారు చేసి, మొత్తం 48 సొసైటీలకు ఇసుక తీత బాధ్యతను అప్పగించనున్నారు.ఈ మేరకు రేపోమాపో జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. గాయత్రీ, కోటిలింగాల మూడు పాయింట్లు, కొవ్వూరు వైపు వాడపల్లి , ఔరంగాబాద్ తదితర ప్రాంతాలలో 6 డీసిల్టేషన్ పాయింట్లు గుర్తించారు. ఒకట్రెండు రోజుల్లో ఇసుక తీత మొదలవుతుంది. బోట్స్‌మన్ సొసైటీలను ఎంపిక చేశారే కానీ.. టన్ను ఇసుక తీతకు ఎంతిస్తారు. ఎన్నిరోజుల్లో సొమ్ము ఇస్తారు. అది ఎవరు ఇస్తారనే విషయాలలో స్పష్టత లేకపోవడంతో గందరగోళం నెలకొంది.



ఆగని ఇసుక దొంగలు

ఇసుక కొరత విపరీతంగా ఉన్నందున ఇసుక దొంగలు బయలు దేరారు. పేపరుమిల్లు వెనుక వైపు ఓ సొసైటీ నిర్వాహకులు గోదావరిలో అక్రమంగా ఇసుక తవ్వి ఒడ్డుకు తేవడంతో అధికారులు పట్టుకున్నారు. ఈ విషయంలో చర్యలు ఏమి తీసుకున్నారో అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.మరో పక్క గతంలో కాతేరులో ఓ లేఅవుట్‌లో సీజ్ చేసిన ఇసుకకు ఎవరు అనుమతిచ్చారో తెలియదు కానీ అక్రమంగా అమ్మేస్తున్నారు. లారీ రూ.30 వేల వరకూ విక్రయిస్తున్నారు. ఫోర్త్ బ్రిడ్జి నుంచి దివాన్‌చెరువు వచ్చే రోడ్డులో ఆటోనగర్ ఎదురుగా గత ఒక పాయింట్ నుంచి ప్రతి రోజు రాత్రి 11 గంటల నుంచి ఇసుక అక్రమ అమ్మకాలు జరుగుతున్నట్టు సమాచారం. కాతేరు నుంచి తొర్రేడు వైపు వెళ్లే రోడ్డులో ఓ విద్యాసంస్థ పరిసర ప్రాంతం నుంచి కూడా అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను విక్రయిస్తున్నారు. టన్నుకు ఏకంగా రూ.1600 వసూలు చేస్తున్నారు. ఇదంతా ప్రత్తిపాడు ప్రాంతానికి రవాణా చేస్తున్నట్టు ప్రత్యక్ష సాక్షులు చెప్పడం గమనార్హం.

- గోదారిలో 9 డీసిల్టేషన్ పాయింట్లు
- 40 బోట్స్‌మన్ సొసైటీలు ఒకే
- నేడు మరో 8 సొసైటీలకు అనుమతి
- రేపోమాపో కలెక్టర్ ఉత్తర్వులు
- ఈ లోపు ఆగని దొంగలు
- లారీ రూ.30 వేల వరకూ అమ్మకం

కొవ్వూరులో కొట్లాట

- రెండో రోజు ఉద్రిక్తత
- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- రంగంలోకి దిగిన ఎస్పీ
- పెద్ద ఎత్తున బలగాలు
- గొడవపడితే క్రిమినల్ కేసులు
- నెలాఖరు వరకు 144 సెక్షన్
- ఇరువర్గాల పెద్దలతో చర్చలు



రాజీవ్‌కాలనీలో మోహరించిన పోలీస్ బలగాలు.. పోలీసుల ఎదుట యువకుల గొడవ

కొవ్వూరు, సెప్టెంబరు 20 : చిన్న వివాదం చినికి చినికి గాలివానగా మారింది. వినాయక నిమజ్జనంలో భాగంగా రాజీవ్‌కాలనీ యువత శోభాయాత్ర శ్రీరామకాలనీ, తునిపేట మీదుగా చేపట్టారు. తునిపేటకు చెందిన కొంతమంది యువత గతంలో కామెంటు చేశారు. దీంతో వినాయకుని నిమజ్జన ఊరేగింపులో ఇరువర్గాలు ఘర్షనకు దిగి గురువారం రాళ్లతో దాడిచేసుకున్నారు. ఈ సంఘటన రెండు రోజులుగా పోలీసులు, కాలనీవాసులకు కంటి మీద కునుకులేకుండా చేస్తుంది. ఇదిలా ఉండగా రెండో రోజు శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి.కొవ్వూరులో గురువారం ఒకటో వార్డు రాజీవ్‌కాలనీలో వినాయక నిమజ్జన ఊరేగింపులో ఘర్షణ చోటుచేసుకుంది. రాజీవ్‌కాలనీ,శ్రీరామకాలనీ (తునిపేట) యువకుల ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో పోలీసులు, కాలనీవాసులు గాయపడ్డారు. ఈ మేరకు సమాచారం అందడంతో జిల్లా ఎస్పీ బి.నరసింహకిశోర్ వెంటనే రంగంలోకి దిగారు. కొవ్వూరు గామన్ బ్రిడ్జి నుంచి మెరకవీధి పెట్రోల్ బంకు వరకు అడుగడుగునా పోలీసు బలగాలతో పికెటింగ్ ఏర్పాటు చేశారు. అయినప్పటికి శుక్రవారం ఉదయం మళ్లీ దాడులు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం రాజీవ్‌కాలనీకి చెందిన నలుగురు యువకులు మద్యం దుకాణానికి వచ్చారు. ఇదంతా గమనిస్తున్న శ్రీరామకాలనీ యువకులు వారిని వెంబడించి దాడిచేశారు. వారిలో ఒకరు పారిపోగా, ఇద్దరిని పోలీసులు తమ వాహనంలో ఎక్కించుకుని తరలించారు. ఒక యువకుడిపై విచక్షణారహితంగా దాడిచేశారు. తప్పించుకుని పారిపోయిన యువకుడు జరిగినదంతా కాలనీలో చెప్పడంతో కాలనీవాసులు ఒక్కసారిగా శ్రీరామకాలనీపై దాడిచేశారు. మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో ధ్వంసం చేశారు. ఇరువర్గాలకు చెందిన ప్రజలు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో వారిన నియంత్రించడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. రాజీవ్‌కాలనీకి వెళ్లే దారిలో ముళ్లకంపలు, స్టాపర్లు ఏర్పాటు చేసి పోలీసులు,రెస్క్యూ టీమ్‌లు మోహరించారు. అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, రాజమహేంద్రవరం సౌత్ డీఎస్పీ భవ్యకిషోర్, ఏఆర్ డీఎస్పీ సివార్‌కె.రవికుమార్,సెంట్రల్ డీఎస్పీ, రాజమహేంద్రవరం, కోనసీమ, కాకినాడ ఏఆర్ బెటాలియన్స్ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇరువర్గాల మధ్య వివాదాన్ని సర్దుబాటు చేసేందుకు ఆరుగురు చొప్పున పెద్దలను పిలిచి మాట్లాడుతున్నట్లు సమాచారం. తొలిరోజు గురువారం పట్టణ సీఐ పి.విశ్వం, రూరల్ సిఐ కె. విజయబాబు, రూరల్ ఎస్ఐ కె.శ్రీహరి సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను చెదరగొట్టారు. రెండువర్గాలపై కేసులునమోదు చేశారు.



సిబ్బందికి ఎస్పీ సూచనలు, ధ్వంసమైన ఆటో, స్కూటర్

కొవ్వూరులో 144 సెక్షన్

కొవ్వూరులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పికెట్‌లు ఏర్పాటు చేశాం. ఇదంతా ఆకతాయిలు చేసిన పని. రాజీవ్‌కాలనీ, శ్రీరామకాలనీలలో ఈ నెలాఖరు వరకు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుంది. బయట వ్యక్తులు రాకుండా బందోబస్తు ఏర్పాటు చేశాం. చట్టపరంగా సమస్య పరిష్కరిస్తాం. వినాయక నిమజ్జనాలను రాత్రి 7 గంటలలోపు ముగించాలి. గోదావరి ఏటిగట్టుపై సుబ్రహ్మణ్య స్నానఘట్టం వద్ద మత్స్యకారులు ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహ నిమజ్జనం వాయిదా వేసుకోవాలి.

- జి.దేవకుమార్, డీఎస్పీ, కొవ్వూరు

గొడవపడితే క్రిమినల్ కేసులే..

శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై పోలీసుశాఖ పరంగా చర్యలు తప్పవు. రాజీవ్‌కాలనీ, శ్రీరామకాలనీ వాసులకు ఇబ్బంది కలగకూడదని అడిషనల్ ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, అదనపు బలగాలతో పికెటింగ్‌లు ఏర్పాటు చేశాం. ఆయా ప్రాంతాల్లో ఎక్కడికక్కడ సిబ్బంది ఉన్నారు.తప్పుచేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. క్రిమినల్ కేసులు నమోదైతే భవిష్యత్ నాశనం అవుతుంది. ఘర్షణకు కారణమైన వారిని గుర్తించి వారిపై చర్యలు చేపడతాం. ప్రతి ఒక్కరూ గొడవలకు దూరంగా ఉంటే మంచిది.

- నరసింహకిశోర్, జిల్లా ఎస్పీ

చల్లబడిన వాతావరణం

రాజమహేంద్రవరం సిటీ/పెరవలి/ గోపాలపురం/తాళ్లపూడి/నల్లజర్ల/కొవ్వూరు, సెప్టెంబరు 20 : గత వారం రోజులుగా ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరైన జనం శుక్రవారం సాయంత్రం సేద తీరారు. జిల్లా వ్యాప్తంగా గత వారం రోజులుగా ఎండలు మండిపోయాయి. ఈ నెల 7న చవితి మునురుగా పట్టింది.. వానపడింది. 8వ తేదీ నుంచి వానలులేవు. పైగా ఎండ తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు 32 నుంచి 38 డిగ్రీల వరకు నమోదయ్యాయి. ఎండలకు జనం ఉక్కపోతతో సతమతమయ్యారు. పలువురు జ్వరాల బారిన పడ్డారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం నుంచి తీవ్రమైన ఎండ.. ఇదేం ఎండరాబాబూ అనుకున్నవారే. అయితే సరిగ్గా సాయంత్రం 4 గంటలకు ఆకాశం మేఘావృతమై కారుమబ్బులతో ఒక్కసారిగా వరుణుడు విజృంభించాడు. దీంతో వాతావరణం చల్లబడింది. రాజమహేంద్రవరంలో కోరుకొండరోడ్డు, కంబాలచెరువు, రామచంద్రరావు పేట, దేవిచౌక్, పేపరుమిల్లు రోడ్డు, క్వారీ సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రహదారులు తడిచిముద్దయ్యా యి.చాలాకాలం తరువాత వాన పడడంతో జనం సేదతీరారు. వాతవరణం పూర్తిగా చల్లబడింది. కొన్ని ప్రాంతాలలో ఒక మోస్తరు జల్లులుగా వాన పడింది. అదేవిధంగా జిల్లాలో పలు మండలలో కూడా వాన కురిసింది. దీంతో వృద్దులు, చిన్నారులు, మహిళలు, ఈ వర్షపు చల్లదనానికి సేత తీరారు. ఈ వర్షం అన్ని రకాల పంటలకు మేలు చేస్తుంద ని రైతులు చెబుతున్నారు. గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జమయమయ్యాయి.ఈదురు గాలులకు పలుచోట్ల చెట్లు విరిగిపడి స్వల్ప అంతరాయం కలిగింది. తాళ్లపూడి మండలంలో 47 మి.మీ వర్షపాతం నమోదైనట్టు సమాచారం.





నిడదవోలులో నీట మునిగిన ప్రధాన రహదారి.. తాళ్లపూడిలో నీట మునిగిన ఒక వీధి

నిడదవోలులో అంధకారం

నిడదవోలు, సెప్టెంబరు 20 : ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం శుక్రవారం నిడదవోలు మెయిన్‌రోడ్లను ముంచెత్తింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుంచి గాంధీ బొమ్మ సెంటరు వరకు బస్టాండ్ నుంచి జెండాల వీధి వరకు ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా ఇలా పలు ప్రధాన రోడ్లన్నీ మోకాళ్ళలోతు పైనే నీట మునిగాయి.ఉరుములు, ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. డ్రైనేజీలు పొంగి పొర్లాయి. నీట మునిగిన రోడ్లలో వాహనాలు మొరాయించి ఆగిపోవడంతో వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. పాఠశాలలు, కళాశాలలు వదిలే సమయానికి కురిసిన భారీ వర్షంతో విద్యార్థులు ఇబ్బందులెదుర్కొన్నారు. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పట్టణమంతా చీకటిమయంగా మారిపోయింది. సాయంత్రం 4 గంటల నుంచి 9 గంటలు వరకూ పట్టణమంతా గాడాంధకారంలో ఉంది.



నీలి మేఘం శ్రీఆంజనేయం

కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట బీచ్ వద్ద శుక్రవారం సాయంత్రం ఆకాశాన్ని నీలి మేఘాలు కమ్మేశాయి. ఆ మేఘాల ముందు అభయమిస్తున్నట్టుగా దర్శనమిచ్చారు ఆంజనేయస్వామి. ఈ దృశ్యం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. - కాకినాడ

అన్నవరం దేవస్థానం రెగ్యులర్ ఈవోగా

రామచంద్రమోహన్

అన్నవరం, సెప్టెంబరు 20: అన్నవరం దేవస్థానం రెగ్యులర్ ఈవోగా కె.రామచంద్రమోహన్‌కు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయ శాఖ కమిషనరు సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వర్క్ అరేంజ్‌మెంట్‌లో భాగంగా గతంలో చంద్రశేఖర్ ఆజాద్ అన్నవరం ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్టు రికార్డుల్లో పేర్కొన్నారు. అయితే ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆజాద్‌ను రెండు రోజుల క్రితం చిత్తూరు ఆర్జేసీగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఖాళీ అయిన స్థానంలో ప్రస్తుతం అన్నవరం ఈవోగా ఉన్న రామచంద్రమోహన్ తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు రెగ్యులర్ ఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తారు.

కాకినాడ, కోనసీమ ఉమ్మడి జిల్లాల ఇంటెలిజెన్స్ డీఎస్పీగా

మురళీమోహన్ బాధ్యతల స్వీకారం



కాకినాడ క్రైం, సెప్టెంబరు 20: కాకినాడ, కోనసీమ ఉమ్మడి జిల్లాల ఇంటెలిజెన్స్ డీఎస్పీగా సుంకర మురళీమోహన్ కాకినాడ వైద్య నగర్‌లోని కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన ఏసీబీ సీఐగా పని చేశారు. అనంతరం కాకినాడ ఎస్బీ డీఎస్పీగా, దిశా డీఎస్పీగా పని చేశారు. తదుపరి పెద్దాపురం ఇన్‌చార్జి డీఎస్పీగా పనిచేసిన ఆయన ఎన్టీఆర్ జిల్లాకు బదిలీపై వెళ్లి తిరిగి కాకినాడ, కోనసీమ ఉమ్మడి జిల్లాల ఇంటెలిజెన్స్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన దుర్గారావు విజయవాడ పటమట డీఎస్పీగా బదిలీ అయ్యారు.



యువజనోత్సవాల్లో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- మహిళలకు సముచిత స్థానం కల్పించాలి
- రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి
- నన్నయ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన యువజనోత్సవాలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 20: దేశాన్ని అభివృద్ధి పథంలో నడపడంలో యువత కీలక బాధ్యతలు స్వీకరించాలని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్ చెరువులోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కన్వెన్షన్‌లో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ (సెట్రాజ్) ఆధ్వర్యంలో యువజనోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో యువశక్తి ఆస్తిగా ఉన్న దేశం భారత్ అన్నారు. నేడు ప్రపంచంలో ఆర్థిక శక్తిగా ఎదిగిన దేశాలు వృద్ధాప్య ఛాయలను కలిగి ఉండగా... భారతదేశం ఒక్కటే భవిష్యత్ అభివృద్ధికి కొలమానంగా ఉందన్నారు. దేశ జనాభాలో 50శాతం పైగా ఉన్న మహిళలను ప్రోత్సహించి వారికి సముచిత స్థానం కల్పించాల్సి ఉందని, కొంత మంది మహిళలు రక్తహీనత, ఎనీమియా, ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. విశిష్ట అతిథి, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ యువతలో మంచి నాయకత్వ లక్షణాలు ఉన్నప్పుడే విజయాలు సాధ్యమవుతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విజ్ఞతతో సద్వినియోగం చేసుకోవడంతో పాటు దేశాభివృద్ధిలో వాటి ద్వారా ఒనగూరే ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకుని రావడంలో యువత పాత్ర కీలకమన్నారు. దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్య చౌదరి కోరారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడంలో ముఖ్య భూమిక వహించాలని కోరారు. యువజన సర్వీసుల శాఖ కమిషనరు పి.శారదాదేవి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో విజేతలకు రాష్ట్రస్థాయికి ఎంపిక వుతారన్నారు. అక్కడి నుంచి జాతీయ స్థాయికి పంపిస్తారన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో అతిథులు ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు, సెట్రాజ్ కాకినాడ సీఈవో కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



యువజనోత్సవాల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి



శిక్షణ ఇస్తున్న పీడీజే సునీత

పారా లీగల్ వలంటీర్లకు

ప్రత్యేక శిక్షణ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో పారా లీగల్ వలంటీర్లకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత మాట్లాడుతూ పారా లీగల్ వలంటీర్లుగా నియమితులైన వారికి న్యాయ సేవలు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించడం ఈ శిక్షణ ఉద్దేశమన్నారు. ప్రజలకు, న్యాయ సేవాధికార సంస్థలకు పీఎల్‌వీలు వారధులుగా వ్యవహరించాలన్నారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.గాయత్రీదేవి, న్యాయవాది పి.శ్రీనివాసరావు, ఏసీఎల్‌లు ఎస్‌కే జబీన, ఎం.లలిత కుమారి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జె.మహేశ్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీఎం ప్రేమ్‌కుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విలియం పలు చట్టాలు, అంశాలను వివరించారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



వెంకన్న (పాత చిత్రం)

అంబాజీపేట, సెప్టెంబరు 20: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ముక్కామల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెనుక చెల్లు వెంకన్న (56) నివాసం ఉంటున్నాడు. ఇక్కడ తాపీ పనులు సరిగ్గా లేకపోవడంతో రెండు వారాల క్రితం హైదరాబాద్‌లోని తన కుమార్తె ఇంటికి వెళ్లి వచ్చాడు. అప్పుల బాధలు ఎక్కువ కావడంతో తన సమీప బంధువునకు స్థలాన్ని విక్రయించాడు. అడ్వాన్సుగా కొంత మొత్తాన్ని తీసుకున్నాడు. ఈ నెల 19వ తేదీన ఇంటి బయట పడుకుంటానని భార్య నాగమణికి చెప్పాడు. ఉదయం చూసేసరికి సమీపంలోని ఓ పాకలో ఉరివేసుకుని ఉండడాన్ని గమనించి స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి అన్న కుమారుడు చెల్లు వెంకటదుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

బాణసంచా పేలుడు ఘటనలో మహిళ మృతి

అమలాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలోని రావులచెరువులో ఇటీవల జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన గొవ్వాల సుబ్బలక్ష్మి (60) కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందింది. సుబ్బలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పేలుడు ఘటనలో గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిగిలిన క్షతగాత్రులను ఎంపీ గంటి హరీష్‌మాధుర్ శుక్రవారం పరామర్శించారు. బాధితులకు మరింత మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే చినరాజప్ప, జాతీయ స్థాయి క్రీడాకారుడు రాంబాబును సత్కరిస్తున్న చినరాజప్ప, విజయ్‌ప్రకాష్, రాజా సూరిబాబురాజు

క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప
- శ్రీప్రకాష్‌లో ప్రారంభమైన సీబీఎస్ఈ క్లస్టర్-7 టీటీ పోటీలు
- 350 మంది క్రీడాకారుల హాజరు

పెద్దాపురం, సెప్టెంబరు 20: విద్యార్థులు అత్యుత్తమ క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. కాకినాడ జిల్లా పెద్దాపురం రామారావుపేటలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగే సీబీఎస్ఈ క్లస్టర్-7 టేబుల్ టెన్నిస్ పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. భవిష్యత్తులో ఒలింపిక్ క్రీడలకు ఈ అకాడమీ ద్వారా మంచి నైపుణ్యం కలిగిన క్రీడాకారులు తయారు కావాలని ఆకాంక్షించారు. అత్యాధునిక సదుపాయాలతో అన్ని హంగులతో పూర్తిస్థాయి అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన టేబుల్ టెన్నిస్ అకాడమీలో క్రీడాకారులు సత్తా చాటాలన్నారు. ఇటువంటి క్రీడలకు శ్రీప్రకాష్ వేదిక కావడం సంతోషదాయకమన్నారు.. ఏపీ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి వి.విశ్వనాథ్ మాట్లాడుతూ అత్యాధునిక హంగులతో ఇటువంటి టేబుల్ టెన్నిస్ అకాడమీ ఇక్కడ రూపుదిద్దుకోవడం గర్వకారణమన్నారు. పాఠశాల డైరెక్టర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు తమ పాఠశాల వేదిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 350 క్రీడాకారులు హాజరుకానున్నట్టు చెప్పారు. అనంతరం పదకొండుసార్లు బాల్ బ్యాడ్మింటన్‌లో జాతీయ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారుడు కుమిలి రాంబాబును ఘనంగా సత్కరించారు. పోటీలకు రిఫరీలుగా రమణకుమార్, వేణు వ్యవహరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు పాల్గొన్నారు.

సొమ్ము ఒకరిది... సోకొకరిది...

- అధికారుల వినోదం కోసం ఐటీడీఏ నిధులతో ఇండోర్ స్టేడియం నిర్మాణం
- గిరిజన ప్రయోజనాలను విస్మరించి రూ.10 లక్షల నిధుల దుర్వినియోగం



రంపచోడవరంలో గోదామును ఇండోర్ స్టేడియంగా మార్చిన దృశ్యం



రంపచోడవరం, సెప్టెంబరు 20: గిరిజనుల అభివృద్ధికి మాత్రమే వినియోగించాల్సిన రంపచోడవరం ఐటీడీఏ నిధులను జగన్ పాలనలో ఉన్నతాధికారులు తమ వినోదం కోసం దుర్వినియోగం చేశారు. రంపచోడవరంలో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ కోర్టును ఐటీడీఏ నిధులతో ఇక్కడి ఉన్నతాధికారులు ఏర్పాటు చేసుకున్నారు. ఎటువంటి అనుమతి, ఆమోదం లేకుండానే... ముఖ్యంగా ఐటీడీఏ పాలకవర్గ తీర్మానం కూడా లేకుండా ఈ ఇండోర్ కోర్టుకు సుమారు రూ.10లక్షలు వెచ్చించినట్టు తెలిసింది. ఐటీడీఏ, రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖల ఉన్నతాధికారుల వినోదం కోసమే దీనిని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు తీర్చిదిద్దారు. ఆ అధికారులు ఇక్కడ రిలాక్స్ అవడం కోసం దీనిని ఏర్పాటు చేసుకున్నారన్న విమర్శలున్నాయి. రంపచోడవరంలో ఐటీడీఏ ఆధీనంలోని గోదామును ఉన్నతాధికారుల ఆనందం కోసం గిరిజన సంక్షేమ ఇంజనీర్లు ఇండోర్ షటిల్ కోర్టుగా మార్చారు. గిరిజనులకు ఉపయోగించాల్సిన నిధుల నుంచి రూ.10లక్షలను ఇందుకు వాడడం వివాదాస్పదమైంది. ఉన్నతాధికారులు రాత్రివేళల్లో ఈ ఇండోర్ స్టేడియాన్ని వినియోగించుకుంటున్నారు. మిగిలిన సమయాల్లో కమర్షియల్ స్టేడియంగా నెలకు రూ.4వేలు వసూలు చేసే వ్యవస్థగా మార్చి కొందరు ఉద్యోగులు, ప్రముఖులను కూడా చేర్చుకున్నారు. ఉన్నతాధికారులు అక్కడ ఉన్న సమయాల్లో సెక్యూరిటీ కారణాలతో ఎవర్నీ అటువైపుగా రానిచ్చేవారు కాదు. అందుకు వారు పహారా కూడా ఏర్పాటు చేసుకునేవారన్న విమర్శలూ ఉన్నాయి.



జైలులో పండించిన కూరగాయలు, మహిళా ఖైదీలు తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న వెంకటలక్ష్మి

ఆశ్రమాన్ని తలపిస్తున్న మహిళా జైలు

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి కితాబు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మహిళా ప్రత్యేక కారాగారం ఆశ్రమాన్ని తలపిస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి కితాబిచ్చారు. శుక్రవారం ఆమె జైలును పూర్తిగా పరిశీలించారు. బ్యారక్‌లు, వంటశాల, బేకరీ, పాఠశాల, గ్రంథాలయంతో పాటు ఆరు బయట జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలు ఆరా తీశారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. మహిళా ఖైదీలు తయారు చేస్తున్న బ్రెడ్, బిస్కట్లు, ఇతర ఆహార పదార్థాలను రుచి చూసి ప్రశంసించారు. జైలు ఆవరణలో మొక్కలు నాటారు. స్త్రీ సంబంధిత వ్యాధులు, పిల్లల వైద్య నిపుణులను రప్పించి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో అర్జీలు స్వీకరించారు. మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, జైలు పర్యవేక్షణాధికారి వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



నూతన యూనిట్ ప్రారంభం సందర్భంగా ఉద్యోగులు, సిబ్బంది

గ్రామీణ ప్రాంతాల్లో

ఉపాధి కల్పన దిశగా పయనం

- దేవీ ఫిషరీస్ ఎండీ యార్లగడ్డ వీర్రాజు
- నూతన రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

కాకినాడ సిటీ/జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 20: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన దిశగా తాము చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించడం వల్ల మంచి ఫలితాలు సాధించగలుగుతున్నామని దేవీ ఫిషరీస్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ యార్లగడ్డ వీర్రాజు అన్నారు. కాకినాడలోని కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగ్గంపేట మండలం సీతానగరంలో నూతనంగా నెలకొల్పిన రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌ను గురువారం ఢిల్లీలో జరిగిన వరల్డ్ ఫుడ్ ఇండియా-2024 ఫెస్టివల్ వేదికగా కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, ప్రహ్లాద్ జోషి, రవ్‌నీత్‌సింగ్ బిట్టు వర్చువల్‌గా ప్రారంభించారని తెలిపారు. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా 2వేల మందికి, పరోక్షంగా వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో యూనిట్లు నెలకొల్పుతున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శేషుమాధవ్

పొగాకు రైతులు అవగాహనతో

అధిక దిగుబడులు సాధించాలి

సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 20: పొగాకు రైతులు పూర్తి అవగాహనతో అధిక దిగుబడులు సాధించవచ్చని సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని హోటల్ మంజీరాలో శుక్రవారం సీటీఆర్ఐ శాస్త్రవేత్తలతో ఫెర్టిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పొగాకు రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన శేషుమాధవ్ పొగాకు పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను క్లుప్తంగా వివరించారు. రైతులు పూర్తిస్థాయిలో అవగాహనతో అధునాతన పద్ధతుల్లో పొగాకు పంట వేసుకోవాలన్నారు. రైతుల అనుమానాలను ఆయన నివృత్తి చేశారు. సీనియర్ శాస్త్రవేత్త పూర్ణబిందు పొగాకు పంటలో ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. 15 నుంచి 20శాతం అధిక దిగుబడి సాధించడానికి ఫెర్టిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ టాక్ నూర్ గ్రాన్యూల్ ఎయిర్ షీల్డ్, కస్టమైజ్డ్ ఫెర్టిలైజర్స్ వాడాలన్నారు. సదస్సులో ఫెర్టిస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కేవీ గోపాల్‌రాజు, గోపాల్‌రెడ్డి, జయబాల, ఆర్.కృష్ణకుమార్, శరత్‌బాబు, బాజీ హుస్సేన్, అవినాష్ తేజ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు తిట్టారని

అలిగి రైలెక్కిన బాలికలు

నిడదవోలులో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన రైల్వే హెడ్ కానిస్టేబుల్



నిడదవోలు, సెప్టెంబరు 20: ఇంట్లో తల్లిదండ్రులు తిట్టారని అలిగిన సుమారు 10 సంవత్సరాల వయసు గల ఇద్దరు బాలికలు ట్రైన్ ఎక్కి నిడదవోలు చేరుకున్నారు. వారిద్దరూ గురువారం సాయంత్రం నిడదవోలు రైల్వే స్టేషన్‌లో తిరుగుతుండగా రైల్వే హెడ్ కానిస్టేబుల్‌కు అనుమానం వచ్చి ఆరా తీశారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో చోటు చేసు కున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి... తల్లిదండ్రులు మందలించారనే కోపంతో అనపర్తికి చెందిన రాచూరి మేరి, మాణిక్యాల గోదగులమ్మ గురువారం రైలు ఎక్కి నిడదవోలు చేరుకున్నారు. ప్లాట్ ఫామ్‌పై సంచరిస్తున్న వారి వివరాలను విధి నిర్వహణలో ఉన్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు తెలుసుకుని అనపర్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం బాలికల తల్లిదండ్రులు నిడదవోలు రైల్వే పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి బాలికలిద్దరినీ తల్లిదండ్రులకు అప్పగించారు.

డిగ్రీ మూడో సెమిస్టర్ పాఠ్యాంశంగా

'ఈ పొలం అమ్మబడును'

యానాం రచయిత పెనుమాక రత్నాకర్ కథకి దక్కిన గౌరవం



యానాం, సెప్టెంబరు 20: యానాంకు చెందిన ప్రముఖ రచయిత రత్నాకర్ పెనుమాక రచించిన కథను ఈ విద్యా సంవత్సరం నుంచి ఆంధ్రప్రదేశ్ డిగ్రీ మూడో సెమిస్టర్ పాఠ్యాంశంగా ఎంపిక చేశారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరులో పెనుమాక విజయకుమార్-మేరీరోజ్ హైమావతి దంపతులకు జన్మించిన రత్నాకర్ యానాంలో స్వచ్ఛంద సేవా సంస్థ నెలకొల్పి 2005 నుంచీ సామాజిక సేవ చేస్తున్నారు. ఇప్పటివరకు 60 కథలు, 5 నవలు, 30 కవితలు రాశారు. 2022లో 'గౌతమి తీరం' పేరుతో మొదటి సంపుటి ఆవిష్కరించారు. ఇప్పటి వరకు 24 కథా బహుమతులు పొందారు. ఈ మధ్య 'ఉష' పత్రిక నిర్వహించిన ప్రపంచ స్థాయి కథల పోటీల్లో ప్రథమ బహుమతి పొందారు. ఆ కథపై అన్ని సాహిత్య వేదికల్లో చర్చ జరిగింది. కథా సాహిత్యంలో నిలిచిపోయే కథగా ప్రశంసలందుకుంది. సహరి పత్రికలో ప్రథమ బహుమతి పొందిన 'ఈ పొలం అమ్మబడును' అనే కథను డిగ్రీ మూడో సెమిస్టర్లో పాఠ్యాంశంగా ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఇప్పటివరకు డిగ్రీ మొదటి, రెండు సెమిస్టర్ వారికి మాత్రమే రెండో భాష సబ్జెక్టుగా ఉండేది. ఈ విద్యా సంవత్సరం నుంచి మూడవ సెమిస్టర్ వారికి తెలుగు భాషను రెండో భాషా సబ్జెక్టుగా ప్రారంభిస్తున్నారు. అందులో కథా సాహిత్యంగా రాచకొండ విశ్వనాథశాస్త్రి లాంటి లబ్ధ ప్రతిష్ఠులైన కథలతో పాటు రత్నాకర్ కథను కూడా ఎంపిక చేశారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని డిగ్రీ కళాశాలల్లో అమలు కానుందని, ఇందుకు ప్రభుత్వం ఉత్తర్వు ఇచ్చినట్టు రత్నాకర్ తెలిపారు. ఇప్పటివరకు జీవించి ఉన్న ఏ కథకుడు (దళిత వర్గానికి చెందిన) కథను ఎంపిక చేయలేదు. ఇంతకు ముందు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి కొలకలూరి ఇనాక్‌కు చెందిన 'ఆకలి కథ' పాఠ్యాంశంగా ఉందని.. ఇప్పుడు డిగ్రీ స్థాయిలో ఇదే ప్రథమమని తెలుస్తోంది. ఇది యానాం దళితవర్గానికి దక్కిన అరుదైన గౌరవమని పలువురు ప్రముఖులు ప్రశంసించారు. ఈ ఘనత సాధించిన రత్నాకర్‌కు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, 'కలైమామణి' పొనుగుమట్ల విష్ణుమూర్తి, ప్రముఖ రచయిత 'కలైమామణి' దాట్ల దేవదానంరాజు అభినందనలు తెలిపారు..

జీజీహెచ్‌లో గైనిక్ సంబంధిత ఆంకాలజీ స్క్రీనింగ్ పరీక్షలు

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 20: మహిళల్లో గర్భసంచి ముఖద్వార క్యాన్సర్‌కి సంబంధించి కాకినాడ జీజీహెచ్ గైనిక్ విభాగంలో ఈ నెల 23 నుంచి 26 వరకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్, ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో గైనకాలజీ ఓపీడీ, ఎస్ఆర్ఎంటీ విభాగంలో క్యాంప్ నిర్వహిస్తారన్నారు. 35ఏళ్ల వయసు దాటిన మహిళలంతా ఈ పరీక్షల్లో పాల్గొనవచ్చన్నారు. దేశ, విదేశాల నుంచి ఆంకాలజీ వైద్య నిపుణులు రానున్నారని వెల్లడించారు. ఈ స్క్రీనింగ్ పరీక్షల్లో పాల్గొనదలచిన మహిళలు ముందుగా గైనిక్ విభాగానికి వచ్చి తమ పేరు, ఫోన్ నెంబరు తెలియపర్చాలన్నారు. అనంతరం నాలుగు రోజుల క్యాంప్‌లో ఎవరెవరికి ఏ సమయం కేటాయించాలనేది నిర్ణయించి తెలియపరుస్తామన్నారు. వారంలో రెండు రోజుల పాటు రొమ్ము, గర్భసంచి ముఖద్వార క్యాన్సర్, నోటి క్యాన్సర్‌లకు స్క్రీనింగ్ నిర్వహించనున్నట్టు ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసన్ తెలిపారు.

ఏజెన్సీ సమాచారం



మడిచర్ల రచ్చబండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

'ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలు'

రంపచోడవరం, సెప్టెంబరు 20: సంక్షేమ ఫలాలను ప్రజల ముంగిట్లోకి చేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పేర్కొన్నారు. మండలంలోని మడిచర్లలో శుక్రవారం నిర్వహించిన రచ్చబండ సభలో ఆమె రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీలతో కలిసి పాల్గొన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. రాజవొమ్మంగి, అడ్డతీగలలో హైస్కూళ్లలో పనులకు రూ.8లక్షలు చొప్పున మంజూరు చేశామన్నారు. ఎంపీటీసీ బచ్చల మంగాదేవి, తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, నాయకులు కారం సురేష్, కారం సింహాచలం, అడబాల బాపిరాజు, పండా చెల్లన్నదొర, సలాది బాపిరాజు, పి.మోహనకృష్ణ, వై.నిరంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో జనరంజక పాలన



ఎటపాక: కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు అన్నారు. మండలంలోని టీపీ వీడులో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. పురుషోత్తపట్నం, నెల్లిపాక, ఎటపాక గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో తెలుగు యువత రంపచోడవరం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు విజ్జిగిరి రవితేజ, ఏలూరి వెంకన్న, జనసేన మండల శాఖ అధ్యక్షుడు మారాసు గంగాధర్, దుద్దుకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం' బ్రోచర్ ఆవిష్కరణ



దేవీపట్నం: ఇందుకూరుపేట, రమణయ్యపేట గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, తెలుగు యువత అధ్యక్షుడు విజయభాస్కర్, నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపీడీవో రత్నకుమారి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మరిశెట్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మెహర్‌బాబా, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం: మండలంలోని చిన్నమట్టపల్లి గ్రామంలో అధికారులు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, ప్రధాన కార్యదర్శి బురక కన్నారావు, కోట్ల బాలయ్య, వెలుగు ఏపీఎం కిషోర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోతుగూడెం: టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి జి.రవినాయక్, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ వంద రోజుల్లో సాధించిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్లను పంచాయతీ సిబ్బంది, కూటమి నాయకులు కలిసి ఇంటింటికీ వెళ్లి అంటించారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ జ్యోతి, సచివాలయ ఏఎన్ఎం రంగమ్మ, టీడీపీ సీనియర్ నాయకుడు పి.దారబాబు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: స్థానిక సచివాలయంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకులు నోముల సత్యనారాయణ, చెలకాని ఉమామహేశ్వరరావు, హేమంత్, నోముల రామారావు, గడ్డిపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

వై.రామవరం: చవిటిదిబ్బలులో ఎంపీడీవో బాపన్నదొర, వ్యవసాయ శాఖ ఏవో ఉషారాణి పాల్గొని ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పాడైన పంచాయతీ భవనాన్ని పరిశీలించి నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్టు ఎంపీడీవో తెలిపారు. మండల ప్రత్యేకాధికారి చిట్టిబాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జడ్డంగి ఎస్ఐగా చిన్నబాబు, రాజవొమ్మంగి ఎస్ఐగా నరసింహామూర్తి





రాజవొమ్మంగి, సెప్టెంబరు 20: రాజవొమ్మంగి, జడ్డంగి పోలీసు స్టేషన్లలో నూతన ఎస్ఐలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాజవొమ్మంగి ఎస్ఐగా ఈఎల్ నరసింహామూర్తి బదిలీపై రాగా ఇప్పటివరకు పనిచేసిన ఎస్ఐ వెంకయ్య ఎస్బీ ఎస్ఐగా బదిలీ అయ్యారు. జడ్డంగి ఎస్ఐగా చిన్నబాబు బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన రఘునాథరావు జగ్గంపేట ఎస్ఐగా వెళ్లిన సంగతి తెలిసిందే.

దేవీపట్నం ఎస్ఐగా షరీఫ్



దేవీపట్నం, సెప్టెంబరు 20: దేవీపట్నం నూతన ఎస్ఐగా షరీఫ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానన్నారు.

మత్స్యకార సహకార సంఘాలకు రాయితీలు

ఐటీడీఏ పీవో సింహాచలం



రంపచోడవరం, సెప్టెంబరు 20: ఏజెన్సీలోని మత్స్య సంఘాలకు రాయితీల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం చెప్పారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మత్స్యకార సహకార సంఘాల పని తీరుపై సమీక్షించారు. గిరిజన మత్స్యకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మత్స్య శాఖ అభివృద్ధి అధికారి జే.సీతారామరాజు, గిరిజన మత్స్య సహకార సంఘాల సభ్యులు, గ్రామ మత్స్య సహాయకులు కె.బాలాజీ, సీహెచ్ రామకృష్ణ, సత్యవతి, సత్యవేణి పాల్గొన్నారు.

'విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి'



రంపచోడవరం, సెప్టెంబరు 20: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సబ్ కలెక్టరు కల్పశ్రీతో కలిసి మండలంలోని బూసిగూడెం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పీవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సిలబస్ పూర్తి చేయాలన్నారు. విద్యార్థులు పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ట్రిపుల్ ఐటీలో ప్రవేశం, సివిల్ సర్వీసెస్ పోస్టులు పొందేలా చదివి ఏజెన్సీకి పేరు, ప్రతిష్ఠలు తేవాలని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

దేవీపట్నం, సెప్టెంబరు 20: మండలంలోని ఇందుకూరుపేట హైస్కూల్‌లో మండల స్థాయి పాఠశాల ఫెడరేషన్ ఆటల పోటీలు శుక్రవారం మొదలయ్యాయి. ఎంఈవో బాలుదొర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మర్రిశెట్ల వెంకటేశ్వరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ సామిరెడ్డి వీరభద్ర రామకృష్ణ, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు ముత్యాలరావు, నాయకులు నగేష్, హరిశ్చంద్రుడు, నాగేశ్వరరావు, చంటి, అంజిరెడ్డి, రేలంగి రాంబాబు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూపై సమగ్ర విచారణ జరపాలి

కడియం, సెప్టెంబరు 20: తిరుపతి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఐదేళ్లలో లడ్డూ ప్రసాదం తయారీపై జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బొర్సు సుబ్రహ్మణ్యం శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా గత ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమన్నారు. అలానే గడిచిన ఐదేళ్లలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడులపై కూడా సమగ్ర విచారణ జరపాలని, ప్రత్యక్షంగా హిందువులకు క్షమాపణ చెప్పించాలని పేర్కొన్నారు.

ఆర్థిక సంక్షోభంలోనూ సంక్షేమ పథకాల అమలు

- నియోజకవర్గాల బాట పట్టిన పాలకులు
- 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట పర్యటనలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 20: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం రాజమహేంద్రవరం 12,49,50 డివిజన్లకు సంబంధించి లాలాచెరువు చౌడేశ్వరినగర్ వాంబేకాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. దీనికి ఎమ్మెల్యే వాసు, కమిషనర్ కేతన్‌గార్గ్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వమని కూటమి ప్రభుత్వం ప్రజలతో అనిపించుకుందన్నారు. పింఛన్లు ఒకేసారి రూ.వెయ్యి పెంచిందని, ఒకే రోజులో 65.18లక్షల మందికి ఇంటింటికీ వెళ్లి మొత్తం రూ4.408 కోట్లు పంపిణీ చేసిందన్నారు. రూ1674.47 కోట్లు ధాన్యం కొనుగోలు బకాయిలను చెల్లించి అన్నదాతను ఆదుకున్నారన్నారు. పేదల కోసం రూ.5కే అన్న క్యాంటీన్‌లో భోజనాలు పెడుతున్నారన్నారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ రాజమహేంద్రవంలో మూడు అన్నకేంటిన్లు విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. మరో రెండు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. నగరాన్ని కాలుష్యరహితంగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, కాశి నవీన్‌కుమార్, మరుకుర్తి రవియాదవ్, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, ఎస్ఈ పాండురంగారావు పాల్గొన్నారు. అలాగే స్థానిక 21వ డివిజన్ ఉల్లితోట వీధిలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు నిర్వహించారు.



బిక్కవోలు: పందలపాకలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

100 రోజుల్లోనే ప్రజల మన్ననలు పొందాం: ఎమ్మెల్యే బత్తుల



సీతానగరం: ప్లకార్డు చూపిస్తున్న ఎమ్మెల్యే బత్తుల, బీవీఆర్ చౌదరి

సీతానగరం, సెప్టెంబరు 20: మండలంలోని ఇనుగంటివారిపేట, రామచంద్రపురం గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ప్రజల వద్దకు వెళ్లి 100 రోజుల్లో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ 100 రోజుల్లోనే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల మన్ననలు పొంది కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వమని నిరూపించుకుందన్నారు.కార్యక్రమంలో వలవల రాజా, జడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైసీపీ నాయకులు చల్లమళ్ల సుజిరాజు, మద్దాల ఏసుపాదం, కోడేబత్తుల వరప్రసాద్‌చౌదరి, కలగర బాలకృష్ణ పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

కడియం: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని ఆధ్వర్యంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైనా, ఎన్ని ఇబ్బందులున్నా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు సుపరిపాలన అందించిందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, వరగోగుల వెంకటేశ్వరరావు, చిలుకూరి నాగేశ్వరరావు, చిక్కాల ఈశ్వరరావు, నేలపూడి కింగ్, మర్రి శంకర్, పలు శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు సెప్టెంబరు 20: పందలపాక గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విచ్చేసి మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కెనాల్ రోడ్డు మరమ్మతులకు రూ.6.33 కోట్లు, రామవరం-రాయవరం రోడ్డుకు రూ.1.50 కోట్లు, ఏడు దేవాలయాల అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయించామన్నారు. భవిష్యత్‌లో అనపర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని నల్లమిల్లి అన్నారు. ఈ సందర్భంగా వంద రోజుల అభివృద్ధిపై ముద్రించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధికారులతో బాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో సాంస్కృతిక సంబరం

- 1369 మంది యువతీయువకుల నమోదు
- పలు పోటీల్లో విజేతలను ప్రకటించిన సెట్రాజ్ సీఈవో



నన్నయ వర్సిటీలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

దివాన్‌చెరువు, సెప్టెంబరు 20: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో జాతీయ యువజనోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విజేతలను జిల్లా సెట్రాజ్ సీఈవో (ఎఫ్ఏసీ) కేఎస్‌వీవీ కాశీవిశ్వేశ్వరరావు శుక్రవారం సాయంత్రం ప్రకటించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 1369 మంది యువతీయువకులు ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో ఆవిష్కరణలో జె.దేశిక్ రాజారెడ్డి గ్రూప్ ప్రథమ స్థానం, ఎల్.రత్నదీపు ద్వితీయ స్థానం, సి.జాహ్నవి తృతీయస్థానంలో నిలిచారు. జానపద నృత్యం(గ్రూపు)లో పావని బృందం, మణిపూర్ సాంస్కృతిక నృత్యం ద్వితీయ స్థానం, జయశ్రీ బృందం తృతీయస్థానం సాధించారు. జానపదనృత్యం సోలో ప్రదర్శనలో బి.దీపిక, పి.బౌమ్యశ్రీజ, ఆర్.నవ్యతేజశ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. జానపద గేయాలు విభాగంలో స్వాతి బృందం మొదటి స్థానం, బ్లెస్సీ బృందం ద్వితీయస్థానం, జేమ్ సీ జోసఫ్ తృతీయస్థానంలో నిలిచారు. జానపద గేయాలు సోలోలో ఎస్.ఆషిక్, పి.రఘు, షేక్ అబ్రార్ ఉల్క్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. కథ రాయడంలో సీహెచ్ ప్రశాంతి ప్రథమ స్థానం, ఎస్.హేమమాలిని ద్వితీయస్థానం, ఎ.పావని తృతీయస్థానంలో నిలిచారన్నారు. పెయింటింగ్‌లో కె.లాజర్ మొదటి స్థానం, ఇ.సువర్ణ జ్యోతి రెండోస్థానం, జి.జీవన్‌కుమార్ మూడోస్థానం సాధించినట్టు వివరించారు. కవిత్వంలో కె.షెకినా గిడియోన్ ప్రథమ స్థానం, ఎస్.హేమమాలిని ద్వితీయ స్థానం, స్వర్ణలతాగోష్ తృతీయస్థానం సాధించారు. ఉపన్యాసంలో ఇ.వికాస్‌కుమార్ ప్రథమ, కె.షెకినా గిడియోన్ ద్వితీయ, వై.ఉత్కళ తృతీయస్థానాల్లో నిలిచారని తెలిపారు. యువకృతిలో డి.వెంకట త్రివిక్రమ్ ప్రథమస్థానం, ఎన్.దుర్గాచక్రశ్రావణి ద్వితీయస్థానం, బి.లక్ష్మి సుప్రజాపార్వతి తృతీయస్థానంలో విజేతలుగా నిలిచారని సెట్రాజ్ సీఈవో కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడాభివృద్ధికి కృషి

- నియోజకవర్గ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, సెప్టెంబరు 20: ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడాభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలున్నాయని, ప్రైవేటు పాఠశాలలు ఇరుకు అపార్ట్‌మెంట్లలో కాలం వెళ్లదీస్తున్నాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తిలోని జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయి. ఈ సందర్భంగా హెచ్ఎం పులగం వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ప్రసంగిస్తూ విద్యార్థి దశ నుంచి వ్యాయామం ఎంతో అవసరమన్నారు. క్రీడల్లో అందరూ విజేతలేనని పోటీల్లో పాల్గొన్నప్పుడే విజేతలుగా నిలిచినట్లన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పీఈటీల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ మల్లిడి పార్వతి, నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, బాసి, మామిడిశెట్టి శ్రీను ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

రంగంపేట, సెప్టెంబరు 20: శారీరక, మానసిక బలాన్ని పెంచే క్రీడల పట్ల బాల్యం నుంచి ఆసక్తి పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రంగంపేట జడ్పీ హైస్కూల్లో జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రదాన కార్యక్రమం గురువారం రాత్రి జరిగింది. దీనికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో విజయం సాధించిన 12 మంది క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో పి.మధుసూదనరావు, క్రీడా పోటీల కోఆర్డినేటర్ మేరి హవీలా, వ్యాయామోపాధ్యాయులు బాపిరాజు, శైల, నాగేశ్వరరావు, బూరిబాబు, కళ్యాణి, అరుణ, వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఊలపల్లిలో సామూహిక సీమంతాలు

బిక్కవోలు, సెప్టెంబరు 20: ఊలపల్లిలో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. ఈ సందర్భంగా రాయవరం ఐసీడీఎస్ సీడీపీవో జెస్సీ ఫ్లోరెన్స్ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువులు పుడతారన్నారు. అనంతరం గ్రామంలోని గర్భిణులందరికీ సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు రమ్య, నాయకులు తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, కాకర్ల అశోక్, పెంకే మంగయ్యమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతకుమారి, పంచాయితీ కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులను కించపర్చడం తగదు

ఎంపీడీవోకు వినతి

రాజానగరం, సెప్టెంబరు 20: గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని కించపరిచేలా తమకు విధులు కేటాయించడం కూటమి ప్రభుత్వానికి తగదని సచివాలయ ఉద్యోగుల మండల యూనియన్ శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీయడం, ఇంటింటికీ సర్వే చేసి స్టిక్కర్లు అంటించడం వంటి పనులు సచివాలయ ఉద్యోగులకు అప్పగించడం సరికాదన్నారు. ప్రభుత్వం అప్పగించిన ప్రతీ పనికి క్షేత్రస్థాయిలో శక్తి వంచన లేకుండా ప్రజలకు సేవలందిస్తున్నామని, తమ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా పనులు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఒక వలంటీర్ 50 ఇళ్లకు చేసే పనిని తాము 100 ఇళ్లకు పైబడి చేయడం వల్ల పని ఒత్తిడికి లోనవుతున్నామన్నారు. దయచేసి తమ స్థాయిని దిగజార్చే పనులు అప్పగించవద్దని సచివాలయ ఉద్యోగులు వేడుకున్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్‌కు ఎస్టీయూ లేఖ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 20: రాజమహేంద్రవరంలో ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు జరపడానికి కమిషనర్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ ఎస్టీయూ నాయకులు సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్‌కు లేఖ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరంలో ఎస్టీయూ నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే జీవో ఉన్నప్పటికీ సీడీఎంఏ నుంచి కమిషనర్‌కు ఉత్తర్వులు రాని కారణంగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కారుణ్య నియామకాలు చేపట్టలేదని, వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ స్టేట్ జనరల్ సెక్రటరీ ఎల్.సాయి శ్రీనివాస్, రాజమహేంద్రవరం శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆయాల సేవలు వెలకట్టలేనివి

కడియం, సెప్టెంబరు 20: పాఠశాల తరగతి గదులు, ఆరు బయట మరుగు ప్రదేశాలు రెండు సార్లు శుభ్రం చేస్తూ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పాఠశాల ఆయాల సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ అన్నారు. ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం అమ్మ అమృత హస్తం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శుభ్రతా దినోత్సవం ఘనంగా జరిగింది. ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలను ఘనంగా సత్కరించారు. గ్లౌసులు, మాస్కులు, పూలబొకేలు, పండ్లు అందజేశారు.

కాశీ యాత్రలో గుండెపోటుతో మహిళ మృతి

ఎమ్మెల్యే చొరవతో ఊలపల్లి చేరిన మృతదేహం



సత్యశ్రీదేవి(ఫైల్)

అనపర్తి, సెప్టెంబరు 20: కాశీ యాత్రలో ఓ మహిళ గుండెపోటుతో మృతి చెందింది. బిక్కవోలు మండలం ఊలపల్లికి చెందిన ఎం.సత్యనారాయణ సత్యశ్రీదేవి(45) దంపతులు ఆరు రోజుల క్రితం కాశీకి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గురువారం ఉదయం వీరు ప్రయాణిస్తున్న ట్రైన్ మధ్యప్రదేశ్‌లోని ఆమ్లాకు చేరుకునే సరికి శ్రీదేవికి గుండెపోటు రావడంతో వెంటనే అక్కడి రైల్వే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. రాష్ట్రం కాని రాష్ట్రంలో భార్యను పోగొట్టుకుని దిక్కుతోచని స్థితిలో ఉన్న సత్యనారాయణ పరిస్థితిని ఊలపల్లి టీడీపీ నాయకుడు తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి తెలపడంతో వెంటనే ఎమ్మెల్యే జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన అక్కడి అధికారులతో మాట్లాడి మృతదేహాన్ని తరలించే ఏర్పాట్లు చేశారు. ఆమె మృతదేహం శుక్రవారం రాత్రి ఊలపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీదేవి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే నల్లమిల్లికి, ఎస్పీ నరసింహ కిషోర్‌కు, సురేష్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సమాజంలో గురువుకు విశిష్ట స్థానం

ఎంపీడీవో నరేష్‌కుమార్.. ఉత్తమోపాధ్యాయులకు సత్కారం

కోరుకొండ, సెప్టెంబరు 20: భారతీయ సంస్కృతి సాంప్రదాయాల్లో గురువుది విశిష్ట స్థానమని ఎంపీడీవో నరేష్‌కుమార్, ఎంఈవో టి.కుశలవ దొర పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన మండల స్థాయి గురుపూజోత్సవ కార్యక్రమానికి ఎంపీడీవో ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులపై ఉందని ఎంఈవో అన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఉల్లి సూర్యకుమారి అధ్యక్షతన జిల్లా, మండల స్థాయిలో ఉత్తమోపాధ్యాయులుగా అవార్డులు పొందిన వారికి అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. మండలం నుంచి జిల్లాస్థాయిలో ఐదుగురు, మండల స్థాయిలో ఐదుగురు అవార్డులు గెలుచుకున్నారు. సత్కారం పొందినవారిలో కేవీ సత్యనారాయణ, ఆర్.హనుమంత్‌కుమార్, బి.సమాధానం,వి.కృపావతి, ఆర్.నాగేశ్వరరావు, జి.శివబాబు, కె.షకీనా, ఎం.వరలక్ష్మి, డి.ఉషా రాణి, డీవీఏ ధనలక్ష్మి, పులెపు గంగరాజుకాపు, చల్లా వెంకటేశ్వరరావు, కె.మంగాదేవి ఉన్నారు.

రవీంద్రనాథ్ గిరికి అక్కినేని అవార్డు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 20: తనకు తగ్గ పాత్రలు ఎంచుకొని మహానటుడిగా ఎదిగిన అక్కినేని నాగేశ్వరరావును అభిమానులే కాకుండా అందరూ ఆదర్శంగా తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ సూచించారు. అక్కినేని అభిమాన సంఘం ఆధ్వర్యంలో అడబాల మరిడయ్య సారథ్యంలో అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాన్ని శుక్రవారం సాయంత్రం స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని జిత్ మోహన్ మిత్ర కళావేదికపై నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖకు చెందిన రచయిత, గాయకుడు, నటుడు రవీంద్రనాథ్‌ను అక్కినేని అవార్డుతో సత్కరించారు. ఆయనను పీఎస్ కృష్ణారావు, నిమ్మలపూడి గోవింద్, వి.జగపతి, అడబాల మరిడయ్య, బి.సీతారామారావు, జల్లి ప్రసాద్ అభినందించారు.

అనుమతుల ప్రక్రియ సులభతరం చేయాలి

లైసెన్సెడ్ టెక్నికల్ పర్సన్స్ నిబద్ధతతో పనిచేయాలి

రుడా వైస్ చైర్మన్ కేతన్ గార్గ్



రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 20: ఆన్‌లైన్ విధానంలో భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులు సులభతరం చేసి, నిర్మాణదారులు, లేఅవుట్ డవలపర్స్ నిర్దిష్ట కాలపరిమితిలోనే త్వరగా మంజూరు చేయడానికి సరైన మార్గదర్శనం చేయాలని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. రుడా కార్యాలయంలో శుక్రవారం రాత్రి లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ)కు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ట్రైనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేతన్‌గార్గ్ మాట్లాడుతూ ఎల్‌టీపీలు పూర్తి ప్రొఫెషనల్‌గా బాధ్యత వహిస్తూ లోపాలు లేకుండా చూసి అమలులో ఉన్న బిల్డింగ్ రూల్స్, జోనింగ్ నిబంధనలకు అనుగుణంగా బిల్డింగ్/ లేఅవుట్ అప్లికేషన్లను డీపీఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా నాణ్యతా ప్రమాణాల ప్రకారం అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా నిర్లక్ష్యంగా పనిచేసే ఎల్‌టీపీల లైసెన్సులు రద్దుచేయడంలో వెనుకాడబోమని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ లక్ష్యాలకు అనుగుణంగా నిర్మాణదారులకు సహకారం అందించేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ శాఖలను సమన్వయం చేసుకుంటామని రుడా మాస్టర్ ప్లాన్ త్వరగా ప్రభుత్వం మంజూరు పొందేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. త్వరలోనే ఎల్‌టీపీలు, రూడా పంచాయితీ సెక్రటరీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని గార్గ్ చెప్పారు. సమావేశంలో రుడా ప్లానింగ్ ఆఫీసర్ జి.కోటయ్య, ప్లానింగ్ సిబ్బంది, వార్డ్ ప్లానింగ్ అండ్ రెగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు దారుణం

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : పీడీఎస్‌యూ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 20: గంగవరం ఆశ్రమ పాఠశాలలోని గిరిజన విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. లైంగిక వేధింపుల ఘటనపై జరిగిన ప్రాథమిక విచారణ ఆధారంగా బాధ్యుడైన ప్రధానోపాధ్యాయుడిని అరెస్ట్ చేయాలన్నారు. ఘటన తెలిసి కూడా ఫిర్యాదు చేయని సంక్షేమాధికారి, పాఠశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, ఏలూరులో ఫొటోగ్రఫీ నేర్పిస్తానంటూ మాయమాటలతో బాలికలను నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హెచ్1 డ్రగ్ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ మీదే అమ్మాలి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 20: హెచ్1 డ్రగ్ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ మీదే అమ్మాలని రాజమండ్రి అర్బన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎ.కృష్ణ సూచించారు. ది రాజమండ్రి కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అధ్యక్షుడు పిల్లా బాల అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు కలిగించే మందులు విచ్చలవిడిగా అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యాంటీ బయోటిక్స్ కరోనా నుంచి వాడకం పెరిగిందని, వాడకాన్ని నియంత్రించకపోతే త్వరలో మానవాళికి పెను ప్రమాదం పొంచివుందన్నారు. కాలపరిమితి ముగిసిన మందులను ఎక్కబడితే అక్కడ వేయవద్దని, ఆ మందులను ప్రత్యేకంగా సేకరించి బయోవేస్ట్ సేకరించే వాళ్లకు అందజేయాలని చెప్పారు. సమావేశంలో నాగేశ్వరరావు, సంపత్, రాజా, మల్లి, రామాజీ పాల్గొన్నారు.

అసలే అధిక వర్షాలు.. ఆపై అధిక వడ్డీలు

ఎంపీ పురందేశ్వరికి నందరాడ సొసైటీ రైతుల వినతి

రాజానగరం, సెప్టెంబరు 20: మండలంలోని నందరాడ కో-ఆపరేటివ్ సొసైటీ అధికారులు నిర్లక్ష్య వైఖరిపై పలువురు రైతులు రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అప్పు చెల్లించిన వెంటనే రెన్యువల్ చేయకుండా అధిక వడ్డీల పేరుతో రైతులపై మోయలేని భారం మోపుతున్నారన్నారు. క్రాప్ లోన్లు తీసుకుంటున్న తామంతా ఏటా మార్చి 31వ తేదీ నాటికి 7శాతం వడ్డీ చెల్లించి, రెన్యువల్ చేయించుకుంటున్నామన్నారు. ఈ ఏడాది కూడా చాలా మంది రైతులు వడ్డీ చెల్లించి రసీదులు తీసుకున్నారని, అయితే సొసైటీ వారు ఇప్పటివరకు లోన్లు రెన్యువల్ చేయలేదన్నారు. లోన్లు రెన్యువల్ చేయకపోవడంతో గడచిన నాలుగు నెలలకు 13శాతం వడ్డీ చెల్లించాలని రైతులకు ఫోన్లు చేసి వేధిస్తున్నారన్నారు. అసలే అధిక వర్షాల కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్న సమయంలో అధిక వడ్డీ చెల్లించమనడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సహకార వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న అధికారులపై పాలనాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఎంపీ పురందేశ్వరిని కలిసిన వారిలో నరేంద్రపురం, నందరాడ, సీతారాంపురం గ్రామాలకు చెందిన అడబాల గణపతిరావు, నూనె వెంకన్న, అడబాల ఆదివిష్ణు, తాటికొండ రాంబాబు, కూరాకుల ధర్మరాజు, పల్లపు చక్రరావు, అడబాల పాండవులు, బత్తిన బాలాజీ ఉన్నారు.

లారెల్ హై గ్లోబల్ స్కూల్‌కు లీడింగ్ ఇన్డివిడ్యువల్ స్కూల్ అవార్డు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 20: లారెల్ హైగ్లోబల్ స్కూల్‌కు వరుసగా మూడోసారి లీడింగ్ ఇన్డివిడ్యువల్ స్కూల్ అవార్డు లభించింది.న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన ఇండియా డిడాక్టిక్స్ అసోసియేషన్ (ఐడీఏ)నుంచి అవార్డు లభించింది. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యాబోధనా విధానం, నూతన ఆవిష్కరణ పట్ల ఉన్న ఆసక్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ అవార్డు దేశంలో విద్యాభవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ప్రముఖ స్థానంలో లారెల్ హైగ్లోబల్ స్కూను నిలబెట్టిందన్నారు. ఐడీఏ 19 దేశాల మంత్రిత్వ శాఖలు, సంఘాల మద్దతుతో నడుస్తోందని, 88వేల మంది విద్యారంగ నిపుణులు, 800 సొల్యూషన్ ప్రొవైడర్లతో కలిసి పనిచేస్తోందన్నారు. విద్యారంగం, నైపుణ్యాలను మెరుగుపరడంలో సహకరిస్తోందన్నారు.









మీ సమస్యలేంటమ్మా : మహిళల సమస్యలు వింటున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

ప్రజల చెంతకు.. పాలకులు

సీఎం ఆదేశంతో ఇంటింటికీ ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) / రాజమహేంద్రవరం రూరల్ :కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా సీఎం నారా చంద్రబాబునాయుడు పిలుపుమేరకు శుక్రవారం నుంచి "ఇది మంచి ప్రభుత్వం" అనే కార్యక్రమం ప్రారంభించారు. జిల్లాలోని ఎమ్మెల్యేలంతా ఆయా నియోజకవర్గాల్లో పర్యటించారు. తొలి రోజు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.ఈ నెల 26వ తేదీ వరకూ ప్రజా ప్రతినిధులు, పార్టీవర్గాలు, అధికారులు ప్రజల మధ్యలో ఉంటారు. వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన మంచి పనులు, నెరవేర్చిన హామీలను ప్రజలకు వివరిస్తారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుంటారు. వాటిని నమోదు చేసుకుని పరిష్కరిస్తారు.ప్రతి ఊరులోనూ ప్రజా వేదికలు నిర్వహిస్తున్నారు.ఇందులో ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కాతేరు పంచాయతీ పరిధిలో గల శాంతినగర్‌లో ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. తాము గత 10 పదేళ్లగా శాంతి నగర్‌లో ఉంటున్నా మౌలిక వసతుల్లేవని వాపోయారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గోరంట్ల గ్రామంలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీరందిస్తామని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు లాలా చెరువు, చౌడేశ్వరినగర్, వాంబే కాలనీలో పర్యటించారు.అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బిక్కవోలు మండలం పందలపాక, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కొవ్వూరు ఇందిరమ్మ కాలనీ, యానాది కాలనీ, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు నల్లజర్లలో పర్యటించారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సీతానగరం మండలం ఇను గంటి వారిపేట, రామచంద్రాపురం గ్రామాల్లో పర్యటించారు. అయా గ్రామాల్లో ప్రధాన సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు.

ఇంటింటికీ స్టిక్కర్లు..

100 రోజుల పాలన సందర్భంగా "ఇది మంచి ప్రభు త్వం" పేరుతో విజ య సంకేతాన్ని చూపించే రెండు వేళ్ల గుర్తుతో ఉన్న స్టిక్కరును ప్రతీ ఇంటికి ఇస్తున్నారు.దాంతో పాటు ప్రభుత్వ విజయాల కరపత్రం పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్ సీపీవో, డీఎల్‌డీవోలకు బాధ్యతలు అప్పగించారు. మండల, పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించారు.స్టిక్కర్, కరపత్రాలు ఇంటింటికీ పంపిణీ చేసే బాధ్యతను సచివాలయ సెక్రట రీలకు అప్పగించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనవచ్చు.



కిలో నెయ్యి అన్నవరంలో రూ.538.. సింహాచలంలో కిలో రూ.344

తిరుపతి దేవస్థానానికి సరఫరా అవుతున్న నెయ్యిలో చేప నూనె, జంతు కొవ్వు అవశేషాలు బయటపడి సంచలనం సృష్టిస్తోంది.. తిరుపతి ప్రసాదాన్ని భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారు.. అటువంటిది అక్కడే కల్తీ జరిగిందంటే మిగిలిన ఆలయాల మాటేంటి ఇదీ ప్రతీ భక్తుడిని తొలుస్తున్న ప్రశ్న. మన జిల్లాలో అన్నవరం ప్రసాదానికి మహా డిమాండ్.. ప్రతి ఏటా లక్షలాది కిలోల నెయ్యి వినియోగిస్తారు. అటువంటిది అన్నవరం ఆలయానికి సరఫరా అవుతోన్న నెయ్యిపై 'ఆంధ్రజ్యోతి' ఆరా తీసింది. దీంతో ఈ నెయ్యి బండారం బయటపడింది. ఒకే కంపెనీ అన్నవరం దేవస్థానానికి.. సింహాచలం దేవస్థానానికి నెయ్యి సరఫరా చేస్తోంది.. అన్నవరంలో కిలో నెయ్యికి రూ.538 వసూలు చేస్తుంటే.. అదే కంపెనీ సింహాచలంలో మాత్రం కిలో రూ.344 వసూలుచేయడం గమనార్హం. నేతలు, అధికారుల అండదండలతో కాంట్రాక్టరు గీకుడుకి అడ్డు లేకుండాపోయింది.

- ఒకే కంపెనీ. ధరలో మాత్రం భారీ వ్యత్యాసం
- అన్నవరం దేవస్థానంలో నెయ్యి మాయాజాలం
- రెండేళ్లుగా ఒకే కంపెనీ నుంచి నెయ్యి కొనుగోలు
- నాలుగు సార్లు టెండర్లు.. ఒకే కంపెనీకి కాంట్రాక్టు
- గతంలో విజయ డెయిరీ నుంచి కొనుగోలు
- వైసీపీలో అనామక కంపెనీ నుంచే సరఫరా
- ఏటా 1.80 లక్షల కిలోల నెయ్యి అవసరం
- రెండేళ్లలో రూ.7.76 కోట్ల నొక్కుడు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అన్నవరం దేవస్థానానికి సరఫరా అవుతోన్న లక్షల కిలోల నెయ్యి మంచిదేనా..? లక్షలాది మంది భక్తులు ఇష్టంగా తినే ప్రసాదంలో పూర్తిగా నెయ్యి నాణ్యత పాటిస్తున్నారా..? ఆలయానికి సరఫరా అవుతోన్న నెయ్యి గడచిన రెండేళ్లుగా ఒకే కంపెనీ నుంచే ఎందుకు వస్తోంది.. ఆరునెలలకోసారి టెండర్లు పిలుస్తుండగా.. ప్రతిసారీ అదే కంపెనీకి కాంట్రాక్టు ఎలా దక్కుతోంది.. అదే కంపెనీ సింహాచలం దేవస్థానానికి కిలో నెయ్యి రూ.344కి సరఫరా చేస్తుంటే అన్నవరంలో మాత్రం కిలో రూ.538 ఎలా వసూలు చేస్తోంది. ఏటా దేవస్థానానికి 1.80 లక్షల కిలోల నెయ్యి అవసరమైతే అంత భారీ నెయ్యి ఒక డీలర్ ఎలా సరఫరా చేయగలుగుతున్నాడు. మార్కెట్లో లభ్యమయ్యే నాణ్యమైన నెయ్యి ధరకు.. దేవస్థానానికి సరఫరా చేసే ధరకు ఇంత వ్యత్యాసం ఉంటే.. మరి ఆలయానికి వచ్చే నెయ్యిలో అంత నాణ్యత ఉంటుందా? ఇలా ఎన్నో సందేహాలు భక్తుల నుంచి ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి.

నాణ్యతపై అనుమానాలెన్నో...

వాస్తవానికి స్వచ్ఛమైన నాణ్యతతో కూడిన కిలో ఆవు నెయ్యి రూ.వెయ్యి వరకు పలుకుతోంది. ఆలయాలకు మాత్రం కాంట్రాక్టర్లు సగం ధరకే సరఫరా చేస్తుండడంతో నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లక్షల కిలోల్లో సరఫరా కాబట్టి కాస్త బల్క్‌గా ధర తగ్గిందనుకున్నా ఏదో పేరొందిన డెయిరీలు మాత్రమే ఆ స్థాయిలో నెయ్యి సరఫరా చేయగలవు. అయితే వైసీపీ వచ్చిన తర్వాత వరుసగా రెండేళ్లపాటు ఒకే కంపెనీ నెయ్యి సరఫరా చేస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కంపెనీ తరపున ఓ డీలరు ఇంత భారీ నెయ్యిని ఎలా సరఫరా చేస్తున్నాడనే దానిపై అనుమానాలున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే రోజుకు దాదాపు 496 కిలోల నెయ్యి ఆలయానికి సరఫరా చేయడం అసాధ్యం. పైగా ఒక కిలో ఆవు నెయ్యి తయారవ్వాలంటే సరాసరి 30 లీటర్లకుపైగా పాలు అవసరం. మరి ఈ స్థాయిలో నెయ్యి తయారు చేసి సరఫరా చేయడం సాధారణ కాంట్రాక్టర్‌కు సాధ్యం కాదు. వేర్వేరు ప్రాంతాల నుంచి సేకరించి మిక్స్ చేసే అవకాశాలున్నాయి. దేవస్థానం ఈ నెయ్యి నాణ్యతను ఎంత వరకు సమర్థవంతంగా పరీక్షిస్తుందనేదానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పటికప్పుడు నెయ్యి నాణ్యతను పరీక్షించాల్సి ఉండగా, వైసీపీ పెద్దల సిఫారసు చేసిన కాంట్రాక్టరు కావడంతో అధికారులు ఇదేదీ పెద్దగా పట్టించుకోవడం లేదు. తాజాగా తిరుపతి దేవస్థానానికి సరఫరా అయిన నెయ్యి వివాదాస్పదమైన నేపథ్యంలో ఇక్కడకు సరఫరా అవుతోన్న నెయ్యిపై ఇక నుంచి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

2 కోట్ల ప్యాకెట్లు అమ్మకం..

అన్నవరం దేవస్థానం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రం. ఏటా లక్షలాది మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. ఇక్కడకు వచ్చే ప్రతి భక్తుడు ఎంతో ఇష్టంగా అన్నవరం ప్రసాదాన్ని తింటారు. ఏటా రెండు కోట్ల వరకు ప్రసాదం ప్యాకెట్లు అమ్ముడవుతాయి. ఈ ప్రసాదం తయారీలో నెయ్యి కీలకమైనది. దీని నాణ్యతపైనే ప్రసాదం రుచి ఆధారపడి ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒకే కంపెనీ గడచిన రెండేళ్లుగా నెయ్యి సరఫరా చేస్తోంది. ఈ నెయ్యి ధరపై అనేక అనుమానాలు ఉన్నాయి.

రెండేళ్లు..4 టెండర్లు.. ఒకరికే..

అన్నవరం ఆలయానికి ఏటా 1.80 లక్షల నుంచి రెండు లక్షల కిలోల వరకు నెయ్యి అవసరం. ఈ నెయ్యి కొనుగోలు కోసం దేవస్థానం సెంట్రల్ స్టోర్స్ విభాగం ప్రతి ఆరు నెలలకోసారి టెండర్లు పిలుస్తుంది. ఎవరు తక్కువ ధర కోట్ చేస్తే వారికే అప్పగిస్తుంది. 2022 అక్టోబరు నుంచి ఇప్పటి వరకు నాలుగు సార్లు టెండర్లు పిలవగా వరుసగా ఒకే కంపెనీ పేరుతో టెండర్‌లో పాల్గొంటున్న ఓ డీలర్‌కే ఈ కాంట్రాక్టు దక్కుతుండడం అనుమానాలకు తావిస్తోంది. సదరు కాంట్రాక్టర్ కోట్ చేసిన ధర ఇతర ఆలయాలకంటే ఎక్కువగా ఉన్నా అధికారులు ఇదేదీ పట్టించుకోలేదు. ఈమేరకు అధికారంలో ఉన్న సమయంలో కొందరు వైసీపీ పెద్దలు పావులు కదపడం విశేషం. గడచిన రెండేళ్లుగా సదరు డీలరు దేవస్థానానికి కిలో నెయ్యి 2022 అక్టోబరు నుంచి 2023 మార్చి వరకు కిలో రూ.498 చొప్పున, 2023 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు కిలో రూ.564 చొప్పున, 2023 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు రూ.540, 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు రూ.538.60 చొప్పున సరఫరా చేస్తున్నాడు. సింహాచలం దేవ స్థానానికి మాత్రం ఇదే కంపెనీ కిలో నెయ్యి రూ.344 చొప్పున సరఫరా చేస్తోంది. దీన్నిబట్టి అన్నవరం ఆలయానికి సరఫరా చేసే నెయ్యి ధరలో ఎంత పిండేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ ధరతో పోల్చితే ఈ రెండేళ్లలో దేవస్థానానికి రూ.7.76 కోట్లు నష్టం వాటిల్లినట్టు లెక్క. తిరుపతిలాంటి దేవస్థానానికి కిలో నెయ్యి రూ.411కి సరఫరా కాగా ఇక్కడ మాత్రం ధరలో వ్యత్యాసం ఉండడం విశేషం. వాస్తవానికి జగన్ సర్కారు రాక ముందు అన్నవరం దేవ స్థానానికి సంగం, విజయలాంటి పేరొందిన డెయిరీల నుంచి నెయ్యి వచ్చేది. కమీషన్ల కక్కుర్తితో వైసీపీ 2022 నుంచీ ఊరు పేరు లేని కంపెనీని తెరపైకి తెచ్చి నెయ్యి సరఫరా చేయిస్తుండడం విశేషం.

సీఎస్ఆర్ నిధులతో హాస్టళ్లలో పనులు : కలెక్టర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాల కల్పనపై దృష్టి సారించామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. సంక్షేమ, పరిశ్రమల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ప్రస్తుత పరిస్థితి, చేపట్టవలసిన పనులు, సిద్ధం చేయాల్సిన అంచనాలపై సమీక్షించారు. వసతి గృహాల్లో అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న వసతి గృహాలను వేరొక చోటికి మార్పు చేయాలన్నారు. ఆయా పనులను పరిశ్రమల ఆధ్వర్యంలో చేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో జిల్లా ప్రణాళిక అధికారి,పరిశ్రమలు, ఫ్యాక్టరీల అధికారులు పరిశీలించి త్వరితగతిన నివేదిక అందజేయాలని ఆదేశించారు. రాజమహేంద్రవరం, నిడదవోలు, కానూరు, కోరు కొండ, రాజానగరం, గోకవరం,కడియం, రంగంపేట, దుద్దుకూరు, నల్లజర్ల, కా నూరు, తాళ్లపూడిలో అవసరమైన పనులపై అధికారులు కలెక్టర్‌కి వివరించారు.

ఇసుక తీతకు రెడీ!

- గోదారిలో 9 డీసిల్టేషన్ పాయింట్లు
- 40 బోట్స్‌మన్ సొసైటీలు ఒకే
- నేడు మరో 8 సొసైటీలకు అనుమతి
- రేపోమాపో కలెక్టర్ ఉత్తర్వులు
- ఈ లోపు ఆగని దొంగలు
- లారీ రూ.30 వేల వరకూ అమ్మకం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుక సరఫరాకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం ఇసుక కొరత అధికంగా ఉన్న నేపథ్యంలో వెంటనే ఇసుక తీత మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు అఖండగోదావరి పరిధిలోని ధవళేశ్వరం బ్యారేజి నుంచి గోదావరి నాల్గో బ్రిడ్జి (గామన్) వరకూ 9 డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించారు. ఈ పాయింట్లలో ఇసుక తీయడానికి మొత్తం 48 బోట్స్‌మన్ సొసైటీలను గుర్తించారు. అందులో 40 సొసైటీలకు ఇప్పటికే అనుమతి రాగా శనివారం మరో 8 సొసైటీల ఖరారు చేసి, మొత్తం 48 సొసైటీలకు ఇసుక తీత బాధ్యతను అప్పగించనున్నారు.ఈ మేరకు రేపోమాపో జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. గాయత్రీ, కోటిలింగాల మూడు పాయింట్లు, కొవ్వూరు వైపు వాడపల్లి , ఔరంగాబాద్ తదితర ప్రాంతాలలో 6 డీసిల్టేషన్ పాయింట్లు గుర్తించారు. ఒకట్రెండు రోజుల్లో ఇసుక తీత మొదలవుతుంది. బోట్స్‌మన్ సొసైటీలను ఎంపిక చేశారే కానీ.. టన్ను ఇసుక తీతకు ఎంతిస్తారు. ఎన్నిరోజుల్లో సొమ్ము ఇస్తారు. అది ఎవరు ఇస్తారనే విషయాలలో స్పష్టత లేకపోవడంతో గందరగోళం నెలకొంది.



ఆగని ఇసుక దొంగలు

ఇసుక కొరత విపరీతంగా ఉన్నందున ఇసుక దొంగలు బయలు దేరారు. పేపరుమిల్లు వెనుక వైపు ఓ సొసైటీ నిర్వాహకులు గోదావరిలో అక్రమంగా ఇసుక తవ్వి ఒడ్డుకు తేవడంతో అధికారులు పట్టుకున్నారు. ఈ విషయంలో చర్యలు ఏమి తీసుకున్నారో అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.మరో పక్క గతంలో కాతేరులో ఓ లేఅవుట్‌లో సీజ్ చేసిన ఇసుకకు ఎవరు అనుమతిచ్చారో తెలియదు కానీ అక్రమంగా అమ్మేస్తున్నారు. లారీ రూ.30 వేల వరకూ విక్రయిస్తున్నారు. ఫోర్త్ బ్రిడ్జి నుంచి దివాన్‌చెరువు వచ్చే రోడ్డులో ఆటోనగర్ ఎదురుగా గత ఒక పాయింట్ నుంచి ప్రతి రోజు రాత్రి 11 గంటల నుంచి ఇసుక అక్రమ అమ్మకాలు జరుగుతున్నట్టు సమాచారం. కాతేరు నుంచి తొర్రేడు వైపు వెళ్లే రోడ్డులో ఓ విద్యాసంస్థ పరిసర ప్రాంతం నుంచి కూడా అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను విక్రయిస్తున్నారు. టన్నుకు ఏకంగా రూ.1600 వసూలు చేస్తున్నారు. ఇదంతా ప్రత్తిపాడు ప్రాంతానికి రవాణా చేస్తున్నట్టు ప్రత్యక్ష సాక్షులు చెప్పడం గమనార్హం.

కొవ్వూరులో కొట్లాట

- రెండో రోజు ఉద్రిక్తత
- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- రంగంలోకి దిగిన ఎస్పీ
- పెద్ద ఎత్తున బలగాలు
- గొడవపడితే క్రిమినల్ కేసులు
- నెలాఖరు వరకు 144 సెక్షన్
- ఇరువర్గాల పెద్దలతో చర్చలు





రాజీవ్‌కాలనీలో మోహరించిన పోలీస్ బలగాలు.. పోలీసుల ఎదుట యువకుల గొడవ

కొవ్వూరు, సెప్టెంబరు 20 : చిన్న వివాదం చినికి చినికి గాలివానగా మారింది. వినాయక నిమజ్జనంలో భాగంగా రాజీవ్‌కాలనీ యువత శోభాయాత్ర శ్రీరామకాలనీ, తునిపేట మీదుగా చేపట్టారు. తునిపేటకు చెందిన కొంతమంది యువత గతంలో కామెంటు చేశారు. దీంతో వినాయకుని నిమజ్జన ఊరేగింపులో ఇరువర్గాలు ఘర్షనకు దిగి గురువారం రాళ్ళతో దాడిచేసుకున్నారు. ఈ సంఘటన రెండు రోజులుగా పోలీసులు, కాలనీవాసులకు కంటి మీద కునుకులేకుండా చేస్తుంది. ఇదిలా ఉండగా రెండో రోజు శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి.కొవ్వూరులో గు రువారం ఒకటో వార్డు రాజీవ్‌కాలనీలో వినాయక నిమజ్జన ఊరేగింపులో ఘర్షణ చోటుచేసుకుంది. రాజీవ్‌కాలనీ,శ్రీరామకాలనీ (తునిపేట) యువకు ల ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో పోలీసులు, కాలనీవాసులు గాయపడ్డారు. ఈ మేరకు సమాచారం అందడంతో జిల్లా ఎస్పీ బి.నరసింహకిశోర్ వెంటనే రంగంలోకి దిగారు. కొవ్వూరు గామన్ బ్రిడ్జి నుంచి మెరకవీధి పెట్రోల్ బంకు వరకు అడుగడుగునా పోలీసు బలగాలతో పికెటింగ్ ఏర్పాటు చేశారు. అయినప్పటికి శుక్రవారం ఉదయం మళ్లీ దాడులు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం రాజీవ్‌కాలనీకి చెందిన నలుగురు యువకులు మద్యం దుకాణానికి వచ్చారు. ఇదంతా గమనిస్తున్న శ్రీరామకాలనీ యువకులు వారిని వెంబడించి దాడిచేశారు. వారిలో ఒకరు పారిపోగా, ఇద్దరిని పోలీసులు తమ వాహనంలో ఎక్కించుకుని తరలించారు. ఒక యువకుడిపై విచక్షణారహితంగా దాడిచేశారు. తప్పించుకుని పారిపోయిన యువకుడు జరిగినదంతా కాలనీలో చెప్పడంతో కాలనీవాసులు ఒక్కసారిగా శ్రీరామకాలనీపై దాడిచేశారు. మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో ధ్వంసం చేశారు. ఇరువర్గాలకు చెందిన ప్రజలు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో వారిని నియంత్రించడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. రాజీవ్‌కాలనీకి వెళ్లే దారిలో ముళ్లకంపలు, స్టాపర్లు ఏర్పాటు చేసి పోలీసులు,రెస్క్యూ టీమ్‌లు మోహరించారు. అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, రాజమహేంద్రవరం సౌత్ డీఎస్పీ భవ్యకిషోర్, ఏఆర్ డీఎస్పీ సివార్‌కె.రవికుమార్,సెంట్రల్ డీఎస్పీ, రాజమహేంద్రవరం, కోనసీమ, కాకినాడ ఏఆర్ బెటాలియన్స్ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇరువర్గాల మధ్య వివాదాన్ని సర్దుబాటు చేసేందుకు ఆరుగురు చొప్పున పెద్దలను పిలిచి మాట్లాడుతున్నట్లు సమాచారం. తొలిరోజు గురువారం పట్టణ సీఐ పి.విశ్వం, రూరల్ సీఐ కె. విజయబాబు, రూరల్ ఎస్ఐ కె.శ్రీహరి సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను చెదరగొట్టారు. రెండువర్గాలపై కేసులునమోదు చేశారు.



సిబ్బందికి ఎస్పీ సూచనలు, ధ్వంసమైన ఆటో, స్కూటర్

కొవ్వూరులో 144 సెక్షన్

కొవ్వూరులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పికెట్‌లు ఏర్పాటు చేశాం. ఇదంతా ఆకతాయిలు చేసిన పని. రాజీవ్‌కాలనీ, శ్రీరామకాలనీలలో ఈ నెలాఖరు వరకు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుంది. బయట వ్యక్తులు రాకుండా బందోబస్తు ఏర్పాటు చేశాం. చట్టపరంగా సమస్య పరిష్కరిస్తాం. వినాయక నిమజ్జనాలను రాత్రి 7 గంటలలోపు ముగించాలి. గోదావరి ఏటిగట్టుపై సుబ్రహ్మణ్య స్నానఘట్టం వద్ద మత్స్యకారులు ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహ నిమజ్జనం వాయిదా వేసుకోవాలి.

- జి.దేవకుమార్, డీఎస్పీ, కొవ్వూరు

గొడవపడితే క్రిమినల్ కేసులే..

శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై పోలీసుశాఖ పరంగా చర్యలు తప్పవు. రాజీవ్‌కాలనీ, శ్రీరామకాలనీ వాసులకు ఇబ్బంది కలగకూడదని అడిషనల్ ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, అదనపు బలగాలతో పికెటింగ్‌లు ఏర్పాటు చేశాం. ఆయా ప్రాంతాల్లో ఎక్కడికక్కడ సిబ్బంది ఉన్నారు.తప్పుచేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. క్రిమినల్ కేసులు నమోదైతే భవిష్యత్ నాశనం అవుతుంది. ఘర్షణకు కారణమైన వారిని గుర్తించి వారిపై చర్యలు చేపడతాం. ప్రతి ఒక్కరూ గొడవలకు దూరంగా ఉంటే మంచిది.

- నరసింహకిశోర్, జిల్లా ఎస్పీ

చల్లబడిన వాతావరణం





నిడదవోలులో నీట మునిగిన ప్రధాన రహదారి.. తాళ్లపూడిలో నీట మునిగిన ఒక వీధి

రాజమహేంద్రవరం సిటీ/పెరవలి/ గోపాలపురం/తాళ్లపూడి/నల్లజర్ల/కొవ్వూరు, సెప్టెంబరు 20 : గత వారం రోజులుగా ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరైన జనం శుక్రవారం సాయంత్రం సేద తీరారు. జిల్లా వ్యాప్తంగా గత వారం రోజులుగా ఎండలు మండిపోయాయి. ఈ నెల 7న చవితి ముసురుగా పట్టింది.. వానపడింది. 8వ తేదీ నుంచి వానలులేవు. పైగా ఎండ తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు 32 నుంచి 38 డిగ్రీల వరకు నమోదయ్యాయి. ఎండలకు జనం ఉక్కపోతతో సతమతమయ్యారు. పలువురు జ్వరాల బారిన పడ్డారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం నుంచి తీవ్రమైన ఎండ.. ఇదేం ఎండరాబాబూ అనుకున్నవారే. అయితే సరిగ్గా సాయంత్రం 4 గంటలకు ఆకాశం మేఘావృతమై కారుమబ్బులతో ఒక్కసారిగా వరుణుడు విజృం భించాడు. దీంతో వాతావరణం చల్లబడింది. రాజమహేంద్రవరంలో కోరుకొండరోడ్డు, కంబాలచెరువు, రామచంద్రరావు పేట, దేవిచౌక్, పేపరుమిల్లు రోడ్డు, క్వారీ సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రహదారులు తడిచిముద్దయ్యా యి.చాలాకాలం తరువాత వాన పడడంతో జనం సేదతీరారు. వాతవరణం పూర్తిగా చల్లబడింది. కొన్ని ప్రాంతాలలో ఒక మోస్తరు జల్లులుగా వాన పడింది. అదేవిధంగా జిల్లాలో పలు మండలలో కూడా వాన కురిసింది. దీంతో వృద్దులు, చిన్నారులు, మహిళలు, ఈ వర్షపు చల్లదనానికి సేత తీరారు. ఈ వర్షం అన్ని రకాల పంటలకు మేలు చేస్తుంద ని రైతులు చెబుతున్నారు. గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జమయమయ్యాయి.ఈదురు గాలులకు పలుచోట్ల చెట్లు విరిగిపడి స్వల్ప అంతరాయం కలిగింది. తాళ్లపూడి మండలంలో 47 మి.మీ వర్షపాతం నమోదైనట్టు సమాచారం.

నిడదవోలులో అంధకారం

నిడదవోలు, సెప్టెంబరు 20 : ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం శుక్రవారం నిడదవోలు మెయిన్‌రోడ్లను ముంచెత్తింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుంచి గాంధీ బొమ్మ సెంటరు వరకు బస్టాండ్ నుంచి జెండాల వీధి వరకు ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా ఇలా పలు ప్రధాన రోడ్లన్నీ మోకాళ్ళలోతు పైనే నీట మునిగాయి.ఉరుములు, ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. డ్రైనేజీలు పొంగి పొర్లాయి. నీట మునిగిన రోడ్లలో వాహనాలు మొరాయించి ఆగిపోవడంతో వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. పాఠశాలలు, కళాశాలలు వదిలే సమయానికి కురిసిన భారీ వర్షంతో విద్యార్థులు ఇబ్బందులెదుర్కొన్నారు. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పట్టణమంతా చీకటిమయంగా మారిపోయింది. సాయంత్రం 4 గంటల నుంచి 9 గంటలు వరకూ పట్టణమంతా గాడాంధకారంలో ఉంది.

23 నుంచి సుందరసాయి నిగమాగమంలో సప్తాహ ప్రవచనాలు

కొవ్వూరు, సెప్టెంబర్ 20: కొవ్వూరు నందమూరు రోడ్డులోని సుందరసాయి నిగమాగమములో ఈ నెల 23వ తేదీ నుంచి 29 వరకు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముకశర్మచే గర్గ మహర్షి విరచిత శ్రీగర్గ భాగవత సప్తాహ ప్రవచనాలు నిర్వహిస్తున్నట్టు శ్రీ పురుషోత్తమ ధర్మప్రచార సభ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటల నుంచి 8 వరకు ప్రవచనాలు కొనసాగుతాయన్నారు.

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకానికి రిజిస్ట్రేషన్ చేసుకోండి

తాళ్లపూడి, సెప్టెంబరు 20: మండలంలోని ఎస్సీ, ఎస్టీ విద్యుత్ సబ్సిడీ పొందున్న గృహ వినియోగదారులు కూడా ప్రధాన మంత్రి సూర్యఘర్ విద్యుత్ పథకానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి అర్హులని వక్తలన్నారు. సోలార్ రూఫ్‌టాప్ పెట్టుకొనేందుకు అనుకూలమైన స్లాబ్ ఏరియా ఉన్న వారు లైన్‌మెన్‌ను లేదా సబ్ స్టేషన్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్‌లు చేసుకోవాలని ఏఈ తెలిపారు. ఈ పథకంలో చేరేవారు అనేక ప్రయోజనాలు పొందేందుకు అర్హులన్నారు.

జిల్లా యువజనోత్సవం పోటీల్లో విజేతలు వీరే

దివాన్‌చెరువు, సెప్టెంబరు 20: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో జాతీయ యువజనోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో విజేతలను జిల్లా సెట్రాజ్ సీఈవో(ఎఫ్ఏసీ) కేవిఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు శుక్రవారం ప్రకటించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 1369 మంది యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో ఆవిష్కరణలో జె.దేశిక్ రాజారెడ్డి గ్రూప్ ప్రథమస్థానం, ఎల్.రత్నదీపు ద్వితీయస్థానం, సి.జాహ్నవి తృతీయస్థానంలో నిలిచారు. జానపద నృత్యం(గ్రూపు)లో పావని బృందం, మణిపూర్ సాంస్కృతిక నృత్యం ద్వితీయస్థానం, జయశ్రీ బృందం తృతీయస్థానం సాధించారు. జానపద నృత్యం సోలో ప్రదర్శనలో బి.దీపిక, పి.బౌమ్యశ్రీజ, ఆర్.నవ్యతేజశ్రీ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. జానపద గేయాల విభాగంలో స్వాతి బృందం మొదటిస్థానం, బ్లెస్సీ బృందం ద్వితీయస్థానం, జేమ్ సీ జోసఫ్ తృతీయ స్థానంలో నిలిచారు. జానపద గేయాలు సోలోలో ఎస్.ఆషిక్, పి.రఘు, షేక్ అబ్రార్ ఉల్హ్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. కథ రాయడంలో సీహెచ్ ప్రశాంతి ప్రథమస్థానం, ఎన్.హేమమాలిని ద్వితీయస్థానం, ఎ.పావని తృతీయస్థానంలో నిలిచారన్నారు. పెయింటింగ్‌లో కె.లాజర్ మొదటి స్థానం, ఇ.సువర్ణ జ్యోతి రెండోస్థానం, జి.జీవన్‌కుమార్ మూడోస్థానం సాధించినట్టు వివరించారు. కవిత్వంలో కె.షెకినా గిడియోన్ ప్రథమస్థానం, ఎన్.హేమమాలిని ద్వితీయస్థానం, స్వర్ణలతాగోష్ తృతీయస్థానం సాధించారు. ఉపన్యాసంలో ఇ.వికాస్ కుమార్ ప్రథమస్థానం, కె.షెకినా గిడియోన్ ద్వితీయస్థానం, వై.ఉత్కళ తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. యువకృతిలో డి.వెంకట త్రివిక్రమ్ ప్రథమస్థానం, ఎస్.దుర్గాచక్ర శ్రావణి ద్వితీయస్థానం, బి.లక్ష్మి సుప్రజాపార్వతి తృతీయస్థానంలో విజేతలుగా నిలిచారని సెట్రాజ్ సీఈవో కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలికలు

నిడదవోలు, సెప్టెంబరు 20: తల్లిదండ్రులు తిట్టారని అలిగిన సుమారు పదేళ్ల వయసు గల ఇద్దరు బాలికలు ట్రైన్ ఎక్కి నిడదవోలు చేరుకున్నారు. వారిద్దరు గురువారం నిడదవోలు రైల్వే స్టేషన్‌లో తిరుగుతుండగా రైల్వే హెడ్ కానిస్టేబుల్‌కు అనుమానం వచ్చి వారిని ఆరా తీశారు. దీంతో వారు ఇచ్చిన సమాచారంతో తల్లిదండ్రులను పిలిపించి బాలికలిద్దరిని అప్పగించారు. శుక్రవారం నిడదవోలులో ఈ సంఘటన చోటు చేసుకుంది. అనపర్తికి చెందిన పదేళ్ల వయసు గల రాచూరి మేరీ, మాణిక్యాల గోదగులమ్మ తల్లిదండ్రులు మందలించారనే కోపంతో గురువారం ట్రైన్ ఎక్కి నిడదవోలు చేరుకున్నారు. నిడదవోలు ప్లాట్‌ఫామ్‌పై సంచరిస్తున్న వారిని రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు గమనించి వివరాలు తెలుసుకుని అనపర్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో శుక్రవారం బాలికల తల్లిదండ్రులు నిడదవోలు రైల్వే పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి బాలికలిద్దరిని తల్లిదండ్రులకు హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు అప్పగించారు.

స్వచ్ఛ భారత్ కరపత్రాల ఆవిష్కరణ

పెరవలి, సెప్టెంబరు 20: క్లీన్ పెరవలి-గ్రీన్ పెరవలి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22 నుంచి గ్రామంలో దీన్ని నిర్వహించనున్నారు. పెరవలి గ్రామ పంచాయతీతో సమన్వయంగా పనిచేస్తూ పర్యావరణాన్ని కాపాడదాం-ప్రపంచాన్ని రక్షిద్దాం నినాదంతో ఆర్యవైశ్య సేవా సంఘం సభ్యులు, ప్రైవేటు స్కూలు యాజమాన్యాలు అయిన వశిష్ట వినియోగదారుల సంఘం, పెరవలి మండలం లయన్స్‌క్లబ్ కలిపి ఈ కార్యక్రమం చేపడుతున్నారు. వశిష్ట స్కూలు నిర్వాహకులు వోలేటి నారాయణరావు, ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ గుడివాడ బాలకృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కోలా సీతయ్య నాయుడు, వశిష్ట వినియోగదారుల సంఘం పెరవలి మండలం కన్వీనర్ సలాది భాస్కరరావు, రెడ్ రోజ్ స్కూలు కరస్పాండెంట్ రవి బాబు, నిర్మల స్కూలు కరస్పాండెంట్ డేవిడ్ కలిసి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పెరవలిలో ప్రతి ఇంటికి వెళ్ళి ఈ కార్యక్రమం ప్రాముఖ్యత తెలుపనున్నారు. పెరవలిలో జాతీయ రహదారిపై మానవహారం ఏర్పాటు చేయాలని వారు నిర్ణయించారు.



టీటీడీ కల్యాణ మండపం ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న నాయకులు

మొక్కలతో పర్యావరణం పదిలం

చాగల్లు, సెప్టెంబరు 20: ఆరోగ్యవంతమైన జీవనం కోసం పచ్చదనం, పరిశుభ్రత అవసరమని మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఆళ్ళ హరిబాబు అన్నారు. శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా టీటీడీ కళ్యాణ మండపం ప్రాంగణంలో పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, టీడీపీ యువ నాయకుడు నాదెళ్ళ శ్రీరామ్, టీడీపీ నాయకులు కరుటూరి సతీష్, కేతా సాహెబ్, డి.రామకృష్ణ, పంచాయతి కార్యదర్శి ఎల్.రవికుమార్, జనసేన నాయకులు ఇంటి వీరబాబు, మిరియాల సతీష్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణపతి ఊరేగింపు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 20: తాడిపర్రులో శుక్రవారం వినాయక చవితి ముగింపు ఉత్సవాల్లో భాగంగా కరికాల భక్త సంఘం ఆధ్వర్యంలో గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగించారు. మహిళల కోలాట నృత్యాలు, వాయిద్యాలతో స్వామి వారిని ఊరేగించారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకులు పీతా రఘు, మోటుపల్లి వీరాంజనేయులు, కొండలరావు తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించారు.



ఎమ్మెల్యే ముప్పిడికి చెక్కును అందిస్తున్న చలపాటి ప్రకాష్, పోచవరం కూటమి నాయకులు

విజయవాడ వరద బాధితులకు ఆర్థికసాయం

తాళ్లపూడి, సెప్టెంబరు 20: టీడీపీకి చెందిన పెండ్యాల అచ్చిబాబు విజ్ఞప్తి మేరకు మండలంలోని పోచవరం పంచాయతీ పరిధిలోని పలువురు పార్టీ నాయకులు చలపాటి ప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ వరద బాధితులకు రూ.1,37,516 చెక్కును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు అందచేశారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కాకర్ల సురేష్, అనపర్తి కృష్ణయ్య, మందపాటి రాజశేఖర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

కొవ్వూరు, సెప్టెంబర్ 20: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో డి.మమ్మీ అన్నారు. శుక్రవారం కొవ్వూరు పట్టణంలోని 2, 3 వార్డులు, మండలంలోని ఐ.పంగిడి గ్రామంలో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహార లోపం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. పాఠశాల పిల్లలకు ఎంపీపీ యోగాసనాలు నేర్పించారు. సీడీపీవో మమ్మీ మాట్లాడుతూ గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనిస్తారన్నారు. పండ్లు, ఆకుకూరలు, ఎక్కువగా తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ సురక్షితంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఆర్.విజయలక్ష్మి, కె.వి.పద్మావతి, ఎంపీటీసీ కె.భవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 20: భారత దేశాన్ని అభివృద్ధిపథంలో నడపడంలో యువత కీలక బాధ్యతలు స్వీకరించాలని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆవరణలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన యువజనోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రపంచంలో యువశక్తి ఆస్తిగా ఉన్న దేశం భారత్ అన్నారు. నేడు ప్రపంచంలో ఆర్థికశక్తిగా ఎదిగిన దేశాలు వృద్ధాప్య ఛాయలు కలిగి ఉండగా భారతదేశం ఒక్కటే భవిష్యత్ అభివృద్ధికి కొలమానంగా ఉందన్నారు. దేశ జనాభాలో 50 శాతం పైగా ఉన్న మహిళలను ప్రోత్సహించి వారికి సముచిత స్థానం కల్పించాల్సి ఉందన్నారు. కొంతమంది మహిళలు రక్తహీనత, అనీమియా ఇతర అనారోగ్యలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. మరో విశిష్ట అతిథి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ యువతలో మంచి నాయకత్వ ల

యువజనోత్సవాల సభలో ఎంపీ పురందేశ్వరి

క్షణాలు ఉన్నప్పుడే విజయాలు సాధ్యమవుతాయన్నారు. ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడంలో ముఖ్య భూమిక వహించాలని కోరారు. యువజన సర్వీసులశాఖ కమిషనర్ పి.శారదాదేవి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయికి ఎంపికవుతారన్నారు. అక్కడి నుంచి జాతీయస్థాయికి పంపిస్తారన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో అతిథులు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో నన్నయ వర్శిటీ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, సెట్రాజ్ కాకినాడ సీఈవో కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



యువజనోత్సవాలలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

నల్లజర్ల, సెప్టెంబరు 20: రాష్ట్రంలో అధికారం చేపట్టిన 100 రోజుల పాలనలో అనేక సంస్కరణలు, విపత్తులను ఎదుర్కోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అపార అనుభవం తోడ్పడిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శుక్రవారం నల్లజర్ల సచివాలయంలో 100 రోజుల పండుగ నిర్వ

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు

హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షోభంలో సంక్షేమ కార్యక్రమాలు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని అన్నారు. ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లి జ్యోతి, మాజీ సర్పంచ్ యలమాటి శ్రీనివాసరావు, ఎంపీడీవో సింహాద్రి, డీటీ కిశోర్, ఎస్సై శ్రీహరి పాల్గొన్నారు.

తీపర్రులో టీడీపీ కార్యకర్తల ప్రచారం

పెరవలి, సెప్టెంబరు 20: ఇది మంచి ప్రభుత్వం అంటూ ఆయా గ్రామాల్లో తెలుగుదేశం కార్యకర్తలు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. పార్టీ ఆదేశాల మేరకు కరపత్రాలు పంచుతూ ఈ వంద రోజులల్లో ప్రభుత్వం సాధించిన విజయాలు చెబుతున్నారు. ఈ సందర్భంగా కానూరు, నడిపల్లి, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, అజ్జరం, పెరవలి, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు నల్లాకులవారిపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు.

ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు

దేవరపల్లి, సెప్టెంబరు 20: దేవరపల్లిలో ఫైర్‌స్టేషన్ మంజూరైందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లిలో శుక్రవారం గోపాలపురం నియోజకవర్గానికి అగ్నిమాపక కేంద్రం మంజూరైందన్నారు. దేవరపల్లి మండలంలో అధికంగా ఇండస్ట్రీయల్ ఏరియా అన్నారు. ఎక్కువ పరిశ్రమలతో పాటు, పొగాకు బేర్న్‌లు కూడా ఉన్నాయన్నారు. దేవరపల్లిలో ఫైర్‌స్టేషన్ నిర్మించేందుకు యాదవోలు రోడ్డులో అయ్యప్పస్వామి గుడి సమీపంలో స్థలాన్ని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక జిల్లా అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ కే.రాజ్యలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆండ్రూ అనిల్, టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు, పెనుమత్స సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో ఫైర్‌స్టేషన్ స్థలసేకరణపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

అందరి సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కాకర్ల నారాయుడు

కొవ్వూరు, సెప్టెంబర్ 20: మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి అంతా సహకరించాలని కొవ్వూరు ఎంపీపీ కాకర్ల నారాయుడు కోరారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలలో మార్పు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీ నిధులను దారి మళ్లించడంతో అవి ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీ ఖాతాల్లో కనిపిస్తున్నాయన్నారు. ఆర్థిక సంఘం నిధులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఎన్ఆర్ఈజీఎస్ నుంచి మండలానికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారన్నారు. గ్రామాలలో పెండింగ్ పనులను డిసెంబరులోగా గుర్తించి, మార్చి నాటికి పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు వీరమళ్ళ నారాయుడు, నూతంగి రేఖ, ఎంపీడీవో కె.సుశీల, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాళీకృష్ణకు టీడీపీ నాయకుల అభినందనలు

దేవరపల్లి, సెప్టెంబరు 20: వ్యాపార రంగంలోనే కాకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాళీకృష్ణను పలువురు అభినందించారు. దేవరపల్లిలో అంబటి సత్యనారాయణ హైస్కూల్, జూనియర్ మహిళా కళాశాలలో విద్యార్థినిలకు యూనిఫాం, హైస్కూల్ విద్యార్థులకు కంచాలు పారిశ్రామికవేత్త శ్రీకాకుళపు కాళీకృష్ణ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కాళీకృష్ణ మాట్లాడుతూ సొంత నిధులతో ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులుగా కరోనా కాలంలో సేవలందించామన్నారు. ప్రతీ ఏటా కళాశాలల్లో, వృద్ధాశ్రమాలకు దుస్తులు అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, ఉప్పులూరి రాంబాబు, ఆర్యవైశ్య సంఘం నాయకులు సూతాపల్లి రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లి జూనియర్ కళాశాల విద్యార్థినిలకు దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీకాకుళపు కాళీకృష్ణ

హైస్కూల్ విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ

తాళ్లపూడి, సెప్టెంబరు 20: తాళ్లపూడి మండలం రెవెన్యూ శాఖలో ఏఎస్‌వోగా పనిచేస్తున్న జోడాల వెంకటేశ్వరరావు శుక్రవారం వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 50 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. వేగేశ్వరపురం హైస్కూల్‌లో ఎంఈవో బాలామణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆర్టీసీ కొవ్వూరు డిపో మేనేజరు వైవీవీ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజరు బస్ పాస్‌లు అందించిన ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

చాగల్లు, సెప్టెంబరు 20: స్థానిక 67, 68, 69 అంగన్‌వాడి కేంద్రాలలో పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాలుగుడ్లు, ఆకుకూరలు, కూరగాయలతో కూడిన పౌష్టికాహారంను తల్లి, బిడ్డలు మరియు గర్భిణీలకు తప్పక ఇవ్వాలని అంగన్‌వాడి టీచర్లు తల్లులకు అవగాహన కల్పించారు. చిన్నారులతో యోగా చేయించి శారీరక ఆరోగ్యంపైన అవగాహన కల్పించారు. అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణనాథుల ఊరేగింపు

దేవరపల్లి, సెప్టెంబరు 20: దేవరపల్లిలో గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా శుక్రవారం గణనాథులను ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. స్థానిక గవర్నమెంట్ ఆసుపత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన వినాయకులను శుక్రవారం ప్రత్యేక వాహనంపై అలంకరించి పలు వీధుల్లో బాణసంచా కాల్పులతో పాటు, డప్పు వాయిద్యాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు, టీడీపీ నాయకులు సుంకర దుర్గారావు ప్రారంభించారు. కార్యక్రమంలో చప్పటి శివనాగప్రసాద్, మాదవరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పాలనపై ప్రచారం

పెరవలి, సెప్టెంబరు 20: ఇది మంచి ప్రభుత్వం అంటూ ఆయా గ్రామాల్లో తెలుగుదేశం కార్యకర్తలు గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. పార్టీ ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో కరపత్రాలు పంచుతూ ఈ వంద రోజుల్లో ప్రభుత్వం సాధించిన విజయాలను తెలుపుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రజలకు వివరిస్తూ మిగిలిన హామీలను కూడా తొందరలోనే పూర్తి చేస్తారని వారు ప్రజలకు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా కానూరు, నడిపల్లి, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, అజ్జరం, పెరవలి, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు నల్లాకులవారి పాలెం, కొత్తపల్లి గ్రామాల్లో కార్యకర్తలు విస్తృత ప్రచారం జరిపారు.

టెక్నాలజీ వాడకంతో తగ్గనున్న ఖర్చులు

దేవరపల్లి, సెప్టెంబరు 20: రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే వ్యవసాయంలో చాలా ఖర్చులు తగ్గుతాయని ప్రకృతి వ్యవసాయ శాఖ డివిజనల్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కురుకూరు గ్రామంలో ఆధునిక వ్యవసాయంపై డ్రోన్‌తో ఎక్కువ విస్తీర్ణంలో రసాయనాలు పిచికారి చేయవచ్చని శ్రీనివాస్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి కాషాయాల తయారీని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు కొయ్యలమూడి అచ్యుత రామయ్య, నల్లూరి రవి, బండి వెంకట్రాజు, బండి సురేష్, కొయ్యలమూడి గోపి, మద్దిపాటి శ్రీను, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, రామలక్ష్మి, దుర్గా, తదితరులు పాల్గొన్నారు.



సాంకేతిక వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

చాగల్లు, సెప్టెంబరు 20: ప్రజల సంక్షేమం తెలుగుదేశంతోనే సాధ్యమని టీడీపీ యువ నాయకుడు నాదెళ్ళ శ్రీరామ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిక్కాలపాలెంలో రూ.24 లక్షలతో చిక్కాలపాలెంలో రోడ్డు, డ్రైన్‌ల నిర్మాణం కోసం భూమిపూజ జరిపారు. గత ప్రభుత్వంలో నిధులు లేక నిర్వీర్యమైన పంచాయతీలు తెలుగుదేశం ప్రభుత్వం రావడంతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఆళ్ళ హరిబాబు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కే.మణి, ఎంపీటీసీ పిల్లి తిరుమలరావు, టీడీపీ నాయకులు కేతా సాహెబ్, యంత్రప్రగడ అబ్బులు చౌదరి, బొల్లిన శివనాగేంద్ర, చిటికెన పెంటారావు, కే.రామూర్తి, బోగ బాబురావు, పత్తిపాటి సాయిబాబా, పిల్లి వెంకట సత్యన్నారాయణ, కేతా సత్యన్నారాయణ, జనసేన నాయకులు సంసాని అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

వెలగదుర్రు రోడ్డులో వీధి లైట్లు ఏర్పాటు



ఉండ్రాజవరం, సెప్టెంబరు 20: తాడిపర్రు గ్రామంలో వెలగదుర్రు పొలిమేర నుంచి వెలగుదుర్రు, ఉండ్రాజవరం, వెళ్ళే రోడ్డు శిథిలావస్థకు చేరడంతో సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు శుక్రవారం వీధి లైట్లు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో ఉండ్రాజవరం నుంచి తాడిపర్రు రావాలన్నా, తాటిపర్రు నుంచి వెలగదుర్రు వెళ్లాలన్నా రోడ్డు చీకటిగా ఉండటంతో ప్రజలు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. దీంతో అక్కడి సమస్యను గుర్తించిన సర్పంచ్ వీధి లైట్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో ఏఈ దొరబాబు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

నల్లజర్లలో 100 రోజుల పండుగ

కొవ్వూరు, సెప్టెంబరు 20: కొవ్వూరు పట్టణంలోని ఇందిరమ్మకాలని, యానాది కాలనీలలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వంద రోజుల ఎన్డీఏ పాలన పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే టి.వి. రామారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, బోడపాటి ముత్యాలరావు, పిల్లలమర్రి మురళీకృష్ణ, మద్దుల సత్యనారాయణ, కిలాని వెంకటలక్ష్మి, దాయన రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించరూ...

కొవ్వూరు, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా, అసంఘటితరంగ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని సిఐటీయు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు విమర్శించారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తారని, అసంఘటిత రంగ కార్మికులకు బీమా సౌకర్యం కల్పిస్తారని ఎదురుచూసిన వారికి నిరాశే కలిగిందన్నారు. శుక్రవారం కొవ్వూరు పట్టణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుందరబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావస్తున్నా ఇసుకపై సరైన విధానాన్ని తీసుకురాకపోవడంతో కార్మికుల ఉపాధి దెబ్బతింటోందన్నారు. కార్యక్రమంలో మైగాపుల నాగేశ్వరరావు, వల్లేపల్లి నరసింహమూర్తి, మద్దుకూరి దొరయ్య తదితరులు ఉన్నారు.



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు

కొవ్వూరు, సెప్టెంబర్ 20: కొవ్వూరు పట్టణంలోని మెరకవీధి వాటర్ ట్యాంకు వద్ద ఏర్పాటు చేసిన లక్ష్మీ గణపతి నవరాత్రి ఉత్సవాలో భాగంగా మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. రౌండ్ రామాలయం యూత్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన గేదెల భావన ఆర్థిక సహకారంతో మహిళలకు పూజా సామగ్రిని అందజేశారు. అధిక సంఖ్యలో మహిళలు లక్ష్మీ గణపతికి పూజలు జరిపారు. అన్నదానం అనంతరం వినాయకుని శోభాయాత్ర, గోదావరిలో నిమజ్జన నిర్వహిస్తామన్నారు.

బృందగాన పోటీల్లో పాల్గొనండి

కొవ్వూరు, సెప్టెంబర్ 20: కొవ్వూరు భారత్ వికాస పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ బృందగాన పోటీలు నిర్వహిస్తున్నట్టు భారత వికాస పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ ఎల్లాప్రగడ రమేష్ తెలిపారు. కొవ్వూరు సంస్కృత కళాశాల ప్రాంగణంలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు 6వ తరగతి నుంచి 10, ఇంటర్మీడియట్ విద్యార్థులకు జాతీయ బృందగాన పోటీలు, భారత్ కో జానో క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. బృందగానంలో దేశభక్తి గీతాలు, హిందీ, సంస్కృతం, తెలుగు, జానపద గేయాలు పాడాలన్నారు. కొవ్వూరు పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

ముగిసిన గణపతి నవరాత్రులు

కొవ్వూరు, సెప్టెంబర్ 20: గణపతి నవరాత్రి వేడుకలను కొవ్వూరు మండలం వేములూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం విజయ గణపతి ఆలయంలో ఉత్సవాలు ముగింపు సందర్భంగా 3వేల మందికి అన్నదానం చేశారు. గత తొమ్మిది రోజులుగా నిత్య పూజలందుకున్న వినాయకుని చేతిలో ఉన్న 60 కిలోల లడ్డూను గ్రామానికి చెందిన మేడూరి వీర్రాజు, దుర్గా సతీష్ రూ.21,900లకు, 11 కిలోల లడ్డూని తమ్మిరిశ శ్రీనివాస్ రూ.11వేలకు, 6 కిలోల లడ్డూని రెడ్డి పెదపూడి తమ్మిరిశ రూ.9 వేలకు దక్కించుకున్నారు. అనంతరం వినాయకుని శోభాయాత్ర నిర్వహించారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్

నిడదవోలు

వీ మ్యాక్స్	సరిపోదా శనివారం
రాధాకృష్ణ	ది గోట్
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్